నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
1
ఆదివారం | సెప్టెంబర్ 01, 2024 | www.navatelangana.com

ఎంపీడీఓ అంగన్‌వాడీ కేంద్రం సందర్శన

నవతెలంగాణ-తాండూర్

తాండూర్‌లోని స్టేషన్ ఏరియా అంగన్వాడీ కేంద్రాన్ని శనివారం ఎంపీడీఓ శ్రీనివాస్ సందర్శించారు. పిల్లలు, లబ్ధిదారులతో మాట్లాడారు. కోడిగుడ్లు, బాలామృతం ఇస్తున్నారా? అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ సెంటర్లలో క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందేటట్లు పర్యవేక్షణ చేయాలని సూపర్వైజర్ కవితకు సూచించారు. గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారంతో భోజనం పెట్టాలని సూచించారు. పౌష్టికాహార పంపిణీలో నిర్లక్ష్యం చేయకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని పేర్కొన్నారు.



బాధిత కుటుంబానినికి ఆర్థికసాయం

నవతెలంగాణ-జైపూర్

ఇందారం గ్రామ పంచాయతీ నజీర్‌పల్లిలో ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన తనుగుల రాజం కుటుంబానికి కాంగ్రెస్ మండల అధ్యక్షులు మహమ్మద్ ఫయాజోద్దీన్ రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. శనివారం నజీర్‌పల్లిలో రాజం స్రవంతితో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. పిల్లలు చిన్నవారైనందున వారి భవిష్యత్తు దృష్టితో మానసికాందోళనకు గురి కాకుండా మనోనిబ్బరం పెంచుకోవాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ పేదలకు అండగా ఉంటుందని, స్థానిక ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి ద్వారా ప్రభుత్వపరంగా సహాయ సహకారం అందిస్తామని భరోసా కల్పించారు.



గిట్టుబాటు కాదు..!

- సిమెంట్ ఫ్యాక్టరీకి భూములిచ్చేందుకు రైతుల విముఖత
- అధికారులు నోటీసులు జారీ చేయడంపై ఆగ్రహం
- ఏటా రెండు పంటలు పండిస్తూ కుటుంబ పోషణ
- నచ్చిన పరిహారం..ఉపాధి కల్పిస్తేనే ఆలోచిస్తామంటున్న అన్నదాతలు

ఆదిలాబాద్ జిల్లాలో రేణుక సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణం మళ్లీ తెరపైకి వచ్చింది. ఈ పరిశ్రమ నిర్మాణం కోసం 2017లో భూసేకరణ చేపట్టిన అధికారులు 107 ఎకరాలు సేకరించారు. రైతుల నుంచి తీసుకున్న భూముల్లో పరిశ్రమకు సంబంధించి బోర్డు పెట్టి వదిలేశారు. దీంతో ఈ పరిశ్రమను ఇచ్చిన భూములు తిరిగి ఇచ్చేయాలని రైతులు ఆందోళన కూడా చేపట్టిన సందర్భాలున్నాయి. తాజాగా మళ్లీ ఈ పరిశ్రమను స్థాపించేందుకు ఆ కంపెనీ యాజమాన్యం ముందుకు రావడంతో రైతుల నుంచి భూసేకరణ ప్రక్రియ చేపట్టాలని భావించింది. తాజాగా సమీపంలో మరో 460 ఎకరాల భూమి ఉండటంతో అదనంగా సేకరించేందుకు సిద్ధమైంది. అధికారులు సంబంధిత రైతులకు నోటీసులు జారీ చేయడంతో మిగితా రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఎకరాకు రూ.8.25లక్షల చొప్పున చెల్లిస్తామని కొందరు రైతుల నుంచి సంతకాలు తీసుకోవడంతో మిగితా రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తక్కువ ధరకు భూములిచ్చేది లేదని ఖరాఖండిగా తేల్చిచెబుతుండటం చర్చనీయాంశంగా మారింది.



సేకరించిన భూముల్లో రేణుక సిమెంట్ కంపెనీ బోర్డు

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఆదిలాబాద్ గ్రామీణ మండలం రామాయి గ్రామ శివారులో 2017లో రైతులకు ఎకరానికి రూ.9.25లక్షలు చెల్లించి 107 ఎకరాల భూమిని సేకరించింది. ఈ పరిశ్రమ స్థాపనకు ఏడేండ్ల క్రితం రైతుల నుంచి భూములను సేకరించిన ప్రభుత్వం నిర్మాణ విషయమై ఊసెత్తలేదు. ఏండ్లు గడుస్తున్నా ఈ ఫ్యాక్టరీ నిర్మాణంపై కదలిక లేకపోవడంతో తీసుకున్న భూములను తిరిగి ఇచ్చేయాలని అప్పట్లో రైతులు డిమాండ్ చేశారు. తాజాగా కంపెనీ యాజమాన్యం ఈ పరిశ్రమను నిర్మించాలని భావించడంతో అధికారులు అదనంగా భూసేకరణ చేపట్టేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే కొందరు రైతులకు నోటీసులు జారీ చేయడంతో మిగితా వారిలో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇది వరకు సేకరించిన భూములకు సమీపంలోనే సర్వే నెం.27, 30, 82, 83ల్లో యాపల్‌గూడ, కొత్తగూడ, రామాయి, యశ్వంత్‌గూడకు చెందిన రైతులకు చెందిన సుమారు 460 ఎకరాల భూమి ఉంది. ఈ భూమిని సేకరించాలని అధికారులు నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది.



భూముల గుండా వెళ్తున్న సాత్నాల ప్రాజెక్టు కాలువ

నచ్చిన పరిహారం..ఉపాధి కల్పిస్తేనే..!

అధికారులు తాజాగా చేపట్టిన భూసేకరణ ప్రకారం ఎకరానికి రూ.8.25లక్షలు రైతులకు చెల్లించేందుకు ముందుకొచ్చారు. కానీ రైతులు మాత్రం అందుకు ససేమిరా అంటున్నారు. ప్రస్తుతం ఈ భూములకు అతి సమీపంలోనే సాత్నాల ప్రాజెక్టుకు సంబంధించి కెనాల్ ఉండటం.. ప్రతి ఏటా పత్తి, సోయా, మొక్కజొన్న తదితర రెండు పంటలు పండిస్తున్నారు. ప్రస్తుతం ఈ భూములకు ఎకరానికి రూ.40లక్షల నుంచి రూ.50లక్షల వరకు డిమాండ్ ఉందని రైతులు చెబుతున్నారు. గతేడాది కొందరు ప్రయివేటు వ్యక్తులు ఎకరానికి రూ.27లక్షల వరకు ఇస్తామని చెప్పినా విక్రయించలేదని రైతులు చెబుతున్నారు. ఈ భూములనే నమ్ముకుంటూ తరతరాల నుంచి సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న తాము వీటిని వదులుకొనే ప్రసక్తే లేదని స్పష్టం చేస్తున్నారు. ఇటీవల ఆయా గ్రామాల రైతులు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌కు వచ్చి ధర్నా నిర్వహించారు. తమకు నచ్చిన పరిహారం ఇవ్వకుండా భూములు తీసుకుంటామంటే ఊరుకునేదిలేదని స్పష్టం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్‌ను కలిసి గోడు వెల్లబోసుకున్నారు.

తక్కువ ధర చెల్లిస్తామంటే కుదరదు : స్వామి, రైతు, యాపల్‌గూడ



రామాయి శివారులో ఉన్న మా భూముల్లో నీటి సౌకర్యం ఉండటంతో ఏటా రెండు పంటలు పండిస్తున్నాం. సాత్నాల కెనాల్ కూడా మా భూములకు దగ్గరలోనే ఉంది. అధికారులు కేవలం ఎకరానికి రూ.8.25లక్షలు మాత్రమే ఇస్తామని చెబుతున్నారు. ఈ ధర మాకు ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదు. ప్రస్తుతం ఇక్కడ రూ.40 నుంచి రూ.50లక్షల వరకు పలుకుతుంది. మాకు నచ్చిన పరిహారం అందిస్తేనే భూములు ఇచ్చేందుకు ఆలోచిస్తాం.

ఈ భూములే మాకు జీవనాధారం : మహేష్, రైతు, యాపల్‌గూడ



తరతరాల నుంచి ఈ భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. మాకు గిట్టుబాటు ధర ఇవ్వకుండా ఫ్యాక్టరీ కోసం భూములు ఇవ్వాలని అడుగుతున్నారు. భూమి పోతే మళ్లీ భూమి దొరకదు. గతంలో భూములు కోల్పోయిన వారికి ఎలాంటి ఉపాధి కల్పించలేదు. మాకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు ఉపాధి కల్పిస్తేనే భూములు అప్పగించేలా సిద్ధమవుతాం.

సేవలు గుర్తుండిపోతాయి



హాజీపూర్: ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ సర్వసాధారణమని, ఉద్యోగిగా ప్రజలకు చేసిన సేవలు గుర్తుండిపోతాయని పలువురు పేర్కొన్నారు. పంచాయితీరాజ్ శాఖలో 32 సంవత్సరాలుగా పలు ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించి ఉద్యోగ విరమణ పొందిన ఏఈ కామేశ్వర్‌రెడ్డి ఉద్యోగ విమరణ సభ శనివారం మంచిర్యాల పద్మనాయక ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా పలువురు పూలమాలలు వేసి పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలతో సన్మానించారు. పదవీ విరమణ ప్రతి ఒక్కరికీ ఉంటుందని, విధుల నిర్వహణలో విశిష్ట సేవలు అందించి మన్ననలు పొందిన వారు చిరకాలం గుర్తుండిపోతారని పలువురు తెలిపారు. పని చేసిన మండలాల్లో కామేశ్వర్‌రెడ్డి గుర్తింపు పొందారని సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఈఈ ఎం.స్వామిరెడ్డి, డీఈలు బి.హరీశ్, రవీందర్ రాథోడ్, సంతోష్, సుబ్బారెడ్డి, సురేశ్, పి.శ్రీధర్, విశ్రాంత ఈఈ మధునయ్య, హాజీపూర్ ఎంపీఓ శ్రీనివాసరెడ్డి, ఈజీఎస్ ఏపీఓ మల్లయ్య, పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీరాజ్ ఏఈలు, జేఈలు, వివిధ శాఖల ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు. కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



నార్నూర్: ఇటీవల మృతి చెందిన బండగూడకు చెందిన బాలింత కినక జల్కర్‌దేవి కుటుంబానికి అభిమన్యు గ్రూప్ అడ్మిన్ శేఖర్‌బాబు, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తొడసం నాగోరావ్, గ్రూప్ సభ్యులు 8రోజుల పాప పాల కోసం, పాప భవిష్యత్తు కోసం తమవంతుగా రూ.50వేల ఆర్థిక సాయం అందజేశారు. రోజు వారీ ఖర్చులకు రూ.20వేలు, పాప పేరు మీద రూ.30వేలు ఫిక్స్ డిపాజిట్ చేసినట్లు గ్రూప్ సభ్యులు పేర్కొన్నారు. గ్రూప్‌లో పెట్టిన పోస్ట్‌కు మానవతా దృక్పథంతో స్పందించి తమ వంతు సాయం అందించిన వారికి ధన్యవాదాలు తెలిపారు. ఆర్థిక సాయం అందించిన గ్రూప్ సభ్యులు పెందూర్ దీపక్, మెస్రం పరమేశ్వర్, మెస్రం సాయి, మరప గంగారాం, చహకటి మోహన్ ఉన్నారు.

గంజాయి మొక్కలు పెంచుతున్న వ్యక్తి అరెస్టు

తాండూర్ : మండలం బోయపల్లి గ్రామ సమీపంలో జాతీయరహదారి ప్రక్కన దాబా నిర్వహిస్తున్న భటేశ్వర్ రాయ్(40)ను గంజాయి మొక్కలు పెంచుతున్న అభియోగంపై అరెస్టు చేసినట్లు ఎస్సై కిరణ్ కుమార్ తెలిపారు బీహార్‌కు చెందిన నిందితుడు ప్రస్తుత బోయపల్లిలో నివాసం ఉంటూ ఇంటి పరిసర ప్రాంతాల్లో గంజాయి మొక్కను పెంచుతున్నట్లు తెలిపారు. ఆయన పెరటి ఆవరణలో మొక్కలను గుర్తించి అదుపులోకి తీసుకున్నామన్నారు. గంజాయి పండించడం, రవాణా చేయడం, సేవించడం నేరమని, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గుండెపోటుపై అవగాహన



బోథ్ : మండలంలోని సొనాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం సిపిఆర్ కార్డియో పలమనరి రిసిస్టేషన్ గుండెపోటుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సామాజిక సేవకుడు రాజ్‌కుమార్ బాసెట్టి మాట్లాడుతూ గుండెపోటు వచ్చినప్పుడు సిపిఆర్ విధానం ద్వారా ఎలాంటి మందులు, ఇంజక్షన్లు అవసరం లేకుండా అంబులెన్స్ వచ్చేంత వరకు మనిషిని కాపాడవచ్చని తెలిపారు. విద్యార్థులకు డెమో ద్వారా సిపిఆర్ గురించి తెలియజేశారు. అభివృద్ధి చెందిన దేశాలలో విద్యార్థులకు సిపిఆర్ విధానం నేర్పుతున్నారని, మన దేశంలో దీనిపై అవగాహన లేకనే చాలా మరణాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. అలాగే పిడుగుపాటు రక్షణ, పర్యావరణ పరిరక్షణకు చెట్ల ఆవశ్యకత, సైబర్ క్రైమ్, నవ సమాజ నిర్మాణానికి ఉపాధ్యాయుని పాత్ర, స్వామి వివేకానంద యువతకు ఇచ్చిన సందేశం విద్యార్థుల అభ్యున్నతికి ఉపయోగపడే వీడియోలను ప్రాజెక్టర్ ద్వారా చూపించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు దేశ్‌ముఖ్ సచిన్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేయాలి



ముథోల్ : కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని నియోజకవర్గ బీఆర్ఎస్ సమన్వయకర్త కిరణ్‌కుమార్ కొమ్రేవార్, ముథోల్ మాజీ సర్పంచ్ వెంకటాపూర్ రాజేందర్ డిమాండ్ చేశారు. బీసీల రిజర్వేషన్ పెంపు, కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయాలని హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న బీసీ నాయకులు బత్తుల సిద్దేశ్వర, సంజీవ్‌ను శనివారం కలిసి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ బిసి డిక్లరేషన్ అమలు చేసి బీసీలకు న్యాయం చేయాలని కోరారు. స్థానిక ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్లు 42 శాతానికి పెంచాలని పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్ కొరకు ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వీరి వెంట భారతీయ ఛత్రపతి పూలే జాగృతి రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, నాయకులు చామకూర రాజు, కెవి గౌడ్, బీసీ సంఘం నాయకులు ఉన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన డాక్టర్ దేవేందర్‌రెడ్డి



సారంగాపూర్ : మండలంలోని వంజర్ గ్రామానికి చెందిన ఆర్ఎంపీ రమేష్ భార్య చాందల లక్ష్మీ(35) ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా డాక్టర్ దేవేందర్‌రెడ్డి శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన వెంట తాజా మాజీ సర్పంచ్ లక్ష్మణ్ ఉన్నారు.

నవతెలంగాణ వార్తకుస్పందన

తాండూర్ : మసీదు వాడలో విషజ్వరాలు ప్రబలుతున్నాయని నవతెలంగాణలో ప్రచురితమైన వార్తకు ఎంపీడీవో, తాండూర్ స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్ స్పందించారు. నాలాల పూడిక తీయించి, పారిశుద్య పనులను నిర్వహించారు. దోమల నియంత్రణకు బయో స్ప్రే చేయించారు. విష జ్వరాలపై ఆరా తీశారు. ప్రతి ఇంటిలో డ్రై డేలు పాటిస్తూ, ఇంటి ఆవరణను శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. పరిశుభ్రత పాటించాలని గ్రామస్తులకు సూచించారు. ఆయన వెంట పంచాయతీ సెక్రెటరీ దివాకర్, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

విద్యుత్ బకాయిలు చెల్లించాలి

- దశలవారీగా చెల్లించేందుకు అవకాశం కల్పిస్తాం
- కొత్త మీటర్లు లేని వారు వెంటనే తీసుకోవాలి
- విద్యుత్తుశాఖ ఎస్ఈ జేఆర్.చౌహాన్



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ప్రభుత్వం ఈ ఏడాది ఏప్రిల్ నుంచి గృహజ్యోతి పథకం కింద 200యూనిట్ల ఉచిత విద్యుత్తు పథకం అమలు చేస్తోందని, ఈ పథకం వర్తించిన వినియోగదారులు ఏప్రిల్ కంటే ముందు ఉన్న పాత బకాయిలను వెంటనే చెల్లించాలని విద్యుత్తుశాఖ ఎస్ఈ జేఆర్.చౌహాన్ అన్నారు. ఈ బిల్లులను దశలవారీగా(ఇన్‌స్టాల్‌మెంట్) చెల్లించేందుకు అవకాశం కల్పిస్తామని తెలిపారు. వినియోగదారులు సహకరించి పాత బిల్లులు చెల్లించాలని సూచించారు. శనివారం నవతెలంగాణ ప్రతినిధితో ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు.

మీటర్లు లేని వారు తీసుకోవాలి

జిల్లాలో ఇప్పటి వరకు విద్యుత్తు మీటర్లు లేని వారు ఈ పదిహేను రోజుల్లోగా తీసుకోవాలని తెలిపారు. ఎస్సీ,ఎస్టీలకు కేవలం రూ.720లకే అందజేస్తామని ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పేర్కొన్నారు. విద్యుత్తు మీటర్లు తీసుకున్న వారు ఈ నెల 17 నుంచి ప్రారంభమయ్యే ప్రజాపాలనలో గృహజ్యోతి పథకం కింద ఉచిత విద్యుత్తు కోసం దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. జిల్లాలో 1.80లక్షల వరకు విద్యుత్తు కనెక్షన్లు ఉండగా 90వేల మందికి గృహజ్యోతి పథకం వర్తిస్తోందని వివరించారు. అర్హులై ఉండి ఈ పథకం వర్తించనివారు ఎంపీడీఓ, మున్సిపల్ కార్యాలయాలకు వెళ్లి సంప్రదించాలన్నారు.

రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

రైతులు మోటార్లు, ఇంటి దగ్గర ఎర్త్ సౌకర్యం చేయించుకోవాలని, మోటార్లకు స్టాటర్ బాక్స్‌లు ప్లాస్టిక్‌వి(పీవీసీ మాదిరి) పెట్టుకోవాలని పేర్కొన్నారు. రైతులు మోటార్లకు కెపాసిటర్లను బిగించుకోవాలని ట్రాన్స్‌ఫార్మర్ మీద అధిక లోడ్ పడదని, ఓల్టేజ్ కూడా బాగుంటుందని చెప్పారు. ఫీసులు పోతే విద్యుత్తు సిబ్బందికి తెలియజేయాలని రైతులు ముట్టుకోకూడదని వివరించారు. మరోపక్క రైతులకు సంబంధించి ట్రాన్స్‌ఫార్మర్లు ఎప్పటికప్పుడు ఇచ్చేస్తున్నామని చెప్పారు. వ్యవసాయం మోటార్లకు సంబంధించి ఇప్పటి వరకు 2100 వరకు దరఖాస్తులు రాగా ఇప్పటి వరకు వెయ్యి దరఖాస్తులు పరిష్కరించామని మరో 625 మాత్రమే పరిశీలనలో ఉన్నాయని వివరించారు. మిగితా వాటిని వివిధ కారణాలతో తిరస్కరించినట్లు తెలిపారు.

ప్రజలను చైతన్యం చేసేవి పత్రికలే

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్



నస్పూర్ : ప్రజలను చైతన్యం చేసేవి పత్రికలే అని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం నవతెలంగాణ వెలువరించిన 9వ వార్షికోత్సవ ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్రికలు ప్రజలను చైతన్య పరచడమే కాకుండా ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా పనిచేస్తాయని తెలిపారు. ప్రజల సమస్యలను వెలికితీయడంలో నవతెలంగాణ ముందుంటుందని, అదే ఒరవడి కొనసాగించాలని పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని సీపీఐ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష



లక్షెట్టిపేట : మండలంలోని దౌడేపల్లి గ్రామపంచాయతీ పరిధిలో సమస్యలు పరిష్కరించాలని సీపీఐ ఆధ్వర్యంలో ఒక్కరోజు నిరాహార దీక్ష చేశారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి మేదరి దేవవరం మాట్లాడుతూ దౌడేపల్లి ప్రాథమిక పాఠశాలలో 70 మంది విద్యార్థులు ఉంటే ఇద్దరు టీచర్లు మాత్రమే ఉన్నారని, కనీసం మంచినీటి సౌకర్యం లేదని తెలిపారు. హెల్త్ సెంటర్‌లో అసౌకర్యాలున్నాయని, పశు వైద్యశాలలో విద్యుత్, వాటర్ సౌకర్యం లేదని తెలిపారు. గంగపుత్ర కాలనీలో చేతిపంపుకు రిపేర్ చేయించాలన్నారు. ఎస్సీ కొత్త కాలనీలో విద్యుత్ సౌకర్యానికి గ్రామంలోని ట్రాన్స్‌ఫార్మర్‌కు కనెక్షన్ ఇవ్వాలని పేర్కొన్నారు. రేషన్ దుకాణంలో ఒక్కో కార్డుదారునికి కిలో బియ్యం తక్కువ వస్తున్నాయని తెలిపారు. అధికారులు స్పందించి సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల సహాయ కార్యదర్శి కేతిరెడ్డి రమణారెడ్డి, దుర్గం దేవన్న, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం ఎస్టీపీపీ పర్యటన రద్దు

- సింగరేణి అధికారుల ఏర్పాట్లు వృథా
- నిరాశ చెందిన నాయకులు

నవతెలంగాణ-జైపూర్

తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు పలువురు రాష్ట్ర మంత్రుల పర్యటన రద్దయింది. హైదరాబాద్ నుండి హెలీకాప్టర్‌లో శనివారం ఉదయం నేరుగా రామగుండం చేరుకున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొన్నారు. ఈ క్రమంలో జైపూర్ సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్‌లో పర్యటించనున్నట్లు ఒక్క రోజు ముందుగానే ప్రకటించారు. ఈ మేరకు సింగరేణి యాజమాన్యం జైపూర్ ఎస్టీపీపీలో ఏర్పాట్లు చేయడంతో పాటు శనివారం సాయంత్రం 4.30గంటల నుండి 5.30గంటల వరకు పర్యటించనున్నట్లు వెల్లడించింది. డిప్యూటీ సీఎం పర్యటన సందర్భంగా రామగుండం సీపీ శ్రీనివాస్ ఎస్టీపీపీ ఏర్పాట్లు పర్యవేక్షించడంతో పాటు డిప్యూటీ సీఎం పర్యటించే ఏరియాలను స్వయంగా పరిశీలించారు. రామగుండం ఏరియాలో పర్యటించిన అనంతరం నేరుగా చెన్నూర్ మండలం శివలింగాపూర్ వద్ద నెలకొల్పిన 11 మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్ ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. అనంతరం జైపూర్ ఎస్టీపీపీ ఆవరణలో ఏర్పాటు చేసిన ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్, అడ్మిన్ బ్లాక్ రాష్ట్ర మంత్రులతో కలిసి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా ఎస్టీపీపీ ఆవరణలో నిర్మించిన కంట్రోల్ రూమ్, సీఓ-2 మిథనాల్ ప్లాంట్, 800 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ప్లాంట్‌ను ఆయన పర్యవేక్షించేందుకు సింగరేణి యాజమాన్యం ఏర్పాట్లు చేసింది.



ఎస్టీపీపీలో నిర్మించిన అడ్మిన్ భవన్(లోపలి భాగం)

డిప్యూటీ సీఎం పర్యటన రద్దుతో నిరాశ

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పర్యటన జిల్లాలో రద్దు కావడంతో సింగరేణి యాజమాన్యంతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు నిరాశ చెందారు. రామగుండం పర్యటన అనంతరం చెన్నూర్ మండలం శివలింగాపూర్ సోలార్ ప్లాంట్‌తో పాటు జైపూర్ ఎస్టీపీపీలో పర్యటించాల్సి ఉన్నందున భారీగా ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం నుండి ఎస్టీపీపీ ఏరియా మొత్తం పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి ఇతరులను ఎవరినీ ఎస్టీపీపీలోకి అనుమతించకుండా పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. మీడియాను సైతం అనుమతి మేరకు అనుమతించి మంత్రుల రాకకోసం ఎదురు చూశారు. సాయంత్రం 6గంటల సమయంలో డిప్యూటీ సీఎం పర్యటన రద్దయినట్లు సమాచారం అందడంతో సింగరేణి అధికారులతో పాటు స్థానిక నాయకులకు నిరాశ మిగిల్చింది.

భారీ వర్షాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నిర్మల్ : రానున్న రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ అభిలాష అభినవ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆది, సోమ వారాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లాలోని ప్రాజెక్టులు, నది పరివాహక ప్రాంత ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. చెరువులు, వాగుల పరిసరాలలోకి పశువులను తీసుకెళ్లరాదని, లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తూ అధికారులు అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
2
ఆదిలాబాద్-నిర్మల్
ఆదివారం | సెప్టెంబర్ 01, 2024 | www.navatelangana.com

అక్రమంగా మొరం తరలిస్తున్న ట్రాక్టర్లు పట్టివేత

నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

ఎలాంటి సమాచారం లేకుండా అక్రమంగా మొరం తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను శనివారం రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. ట్రాక్టర్లలో మొరం ఎక్కడి నుంచి తెస్తున్నారు. ఎక్కడికి తరలిస్తున్నారనే సమాచారం ఇవ్వక పోవడంతో ఒక్కో ట్రాక్టర్‌కు రూ.1000 చొప్పున జరిమాన వేసినట్టు



తహసీల్దార్ శివరాజ్ తెలిపారు. మొరం ఎక్కడ తవ్వకం చేస్తున్నారు. అక్రమ మైనదా..! సక్రమ మైనదా..! ఎవరు తరలిస్తున్నారు. అనే విషయాన్ని ఆయన దాట వేశారు. సదరు మొరం డబుల్ బెడ్ రూం ప్రాంతంలోని ప్రభుత్వ స్థలంలో ఓ రియల్టర్ అక్రమంగా తవ్వకం చేస్తున్నట్టు సమాచారం.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

మున్సిపాలిటీ పరిధిలోని బంగారుగూడకు చెందిన గైక్వాడ్ నివార్తి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. శనివారం విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు బండి నర్సింహాచారి బాధిత కుటుంబాన్ని పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం



చేశారు. అనంతరం తన వంతు సాయంగా నిత్యావసర సరుకులను అందజేశారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు భూమారెడ్డి, ఎస్టీ సెల్ అధ్యక్షులు అనక గంగారాం, ఉపాధ్యక్షులు మాడవి సంతోష్, షేక్. హబీబ్, షేక్. ఫెరోజ్, కొట్నాక్ భరత్, సాహెబ్ రావు, భరత్ పాల్గొన్నారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరు మృతి

నవతెలంగాణ-నేరడిగొండ

రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన శుక్రవారం రాత్రి మండలంలోని రోల్‌మామడ 44వ జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం రాత్రి 9గంటల సమయంలో రెండు బైకులు ఢీకొని యాపల్‌గూడ గ్రామానికి చెందిన పెందూర్ సుదర్శన్‌కి తీవ్ర గాయాలై ఆస్పత్రి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. మృతుడు నిత్యం గృహ నిర్మాణ పనుల కోసం మండల కేంద్రానికి వచ్చి పనులు ముగించుకొని, రాత్రి సమయంలో ఇంటికి వెళ్లేవాడు రోజులాగే శుక్రవారం రాత్రి 9గంటల సమయంలో పనులు ముగించుకొని ఇంటికి వెళ్తున్న క్రమంలో రోల్‌మామడ ఎన్‌హెచ్ 44వ జాతీయ రహదారి దాటుతుండగా మరో ద్విచక్రవాహనం మృతుడి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో సుదర్శన్ అక్కడే రక్తపు మడుగులో పడిపోయాడు. రోల్‌మామడ గ్రామస్తులు చూసి సుదర్శన్ భార్య లక్ష్మీబాయికి సమాచారం అందించగా అతని భార్య వారి బంధువులతో కలిసి సుదర్శన్ పడి ఉన్న సంఘటన స్థలానికి చేరుకొని అంబులెన్స్‌లో నిర్మల్ ఆస్పత్రికి తరలించగా మార్గమధ్యలోనే మరణించినట్టు డాక్టర్లు కుటుంబీకులకు తెలిపారు. ప్రమాదానికి కారణమైన వ్యక్తిపై కుటుంబసభ్యులు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులకు సన్మానం



నవతెలంగాణ-బజార్‌హత్నూర్

ఉద్యోగ విరమణ పొందిన జెడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయులకు విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం ఘనంగా వీడ్కోలు పలికారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాల ఉపాధ్యాయులుగా ఆర్.నరేష్, ఎం.దేవిదాస్ ఉద్యోగ విరమణ పొందిన నేపథ్యంలో వారికి శనివారం పాఠశాలలో వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసి విద్యార్థులు, తోటి ఉపాధ్యాయులు ఘనంగా శాలువాతో సత్కరించారు. అనంతరం ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని, విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల కృషి మరవలేనిదని తెలిపారు. ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులు ఈ పాఠశాలలో చాలాకాలం పనిచేసి విద్యార్థులకు సేవలందించారని అన్నారు. అంకితభావంతో పనిచేసి విద్యార్థుల, పాఠశాల ప్రగతికి కృషి చేసిన ఉపాధ్యాయులను సన్మానించడం ఆనందంగా ఉందని అన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా పాఠశాలలో పనిచేసిన ఉపాధ్యాయులు ఉద్యోగ విరమణ పొంది వెళ్లడం బాధగా ఉన్నప్పటికీ ఉద్యోగ నిర్వహణలో తప్పదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో రిజిస్టర్ల పరిశీలన



నవతెలంగాణ-నేరడిగొండ

మండలం లఖంపూర్ ఆశ్రమ ఉన్నత పాఠశాలను శనివారం తహసీల్దార్ కలీం సందర్శించారు. పాఠశాలలోని స్టాక్ రిజిస్టర్‌లను పరిశీలించారు. అంతేకాకుండా విద్యార్థులకు పెట్టే భోజనాన్ని పరిశీలించారు. పిల్లలకు పెట్టే భోజనాన్ని నాణ్యత పాటించాలని హాస్టల్ వార్డెన్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రాఘవరావు, ప్రధానోపాధ్యాయులు అశోక్, ఉపాధ్యాయులు ఉత్తం పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

నవతెలంగాణ-నేరడిగొండ

సీపీఎస్‌ను రద్దు చేసి, ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని, తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చట్ల ప్రవీణ్ కుమార్, ఉపేందర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సెప్టెంబర్-1న పెన్షన్ విద్రోహ దినాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకువచ్చిన నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఉద్యోగులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు వందలాదిగా పాల్గొని నిరసన ప్రదర్శనను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

భీంపూర్‌లో వైద్య శిబిరం

నవతెలంగాణ-నార్నూర్

వర్షాకాలం నేపథ్యంలో మండలంలోని భీంపూర్ గ్రామపంచాయతీలో శనివారం వైద్యసిబ్బంది వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య శిబిరంలో 65 మందికి రక్త నమూనలు సేకరించారు. టైఫాయిడ్, డెంగ్యూ డయేరియా పరీక్షలు చేసి ఉచిత మందులు పంపిణీ చేసినట్టు హెల్త్ సూపర్‌వైజర్ చరణ్‌దాస్ పేర్కొన్నారు. డ్రైడేలో భాగంగా ఇంటింటా తిరుగుతూ పారిశుధ్య పనులు పరిసరాలను పరిశీలించారు. పరిసరాల పరిశుభ్రత పై అవగాహన కల్పించారు. టైర్లు, డ్రమ్‌ల్లో నిల్వ ఉన్న నీటిని పారబోయించారు. వైద్య శిబిరంలో వైద్య సిబ్బంది జవహర్, గోకుల్, కైలాష్, ఈశ్వర్, ఆశాలు పులా, అరుణ ఉన్నారు.

కార్యదర్శుల రక్తదానం

నవతెలంగాణ-నార్నూర్

గ్రామపంచాయతీలో అనేక సేవలు చేస్తూ మరోపక్క మానవత్వంతో మంచి ఆలోచనలతో ఇతర ప్రాణాలను కాపాడటానికి మండలంలోని పలువురు కార్యదర్శులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం రాత్రి జిల్లా కేంద్రంలోని రిమ్స్‌లో అభిమాన్యు గ్రూప్ ఆధ్వర్యంలో రక్తదానం చేయడానికి ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా అభిమాన్యు గ్రూప్ అడ్మిన్ శేఖర్‌బాబు ఆదివాసీ సమాజం తరుపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రక్త దానం చేసిన వారిలో వివిధ గ్రామాల కార్యదర్శులు ఆత్రం విష్ణు, మెస్రం విజయ్ కుమార్, మెస్రం దయాకర్, అనక అవినాశ్, బి.రాజశేఖర్ ఉన్నారు.

ఆలయాభివృద్ధికి కృషి

నవతెలంగాణ-బోథ్

రామాలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని రామాలయ కమిటీ చైర్మెన్ జీవీ రమణ అన్నారు. మండలంలోని సొనాల గ్రామంలో రామాలయంలో శ్రావణమాసం సందర్భంగా భజన కార్యక్రమాలు నిర్వహించారు. భజన కార్యక్రమాలు నిర్వహించిన భక్తులకు ఆయన సన్మానించారు. అలాగే ఆలయంలో మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు భజన బృందం సభ్యులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

నవతెలంగాణ-నిర్మల్



విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో జిల్లా క్రీడా శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి బేస్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మెన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిర్మల్ జిల్లాలో వ్యాయమ ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధతో క్రీడాకారులకు సంబంధిత క్రీడల్లో శిక్షణ ఇస్తున్నారని అన్నారు. మూడు పర్యాయాలు రాష్ట్ర ఖోఖో అధ్యక్షునిగా సేవాలందించానని అన్నారు. జిల్లాస్థాయి, రాష్ట్ర స్థాయి, జాతీయస్థాయి పలు క్రీడల్లో రాణించిన క్రీడాకారులకు సెర్టిఫికెట్ అందచేస్తారని, భవిష్యత్తులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు సంపాదించుకొనుటకు సువర్ణావకాశం అని వెల్లడించారు. కార్యక్రమంలో బేస్‌బాల్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, సెక్రటరీ గంగాధర్, ఎస్ఎఫ్ కార్యదర్శి రవిందర్‌గౌడ్, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి అన్నపూర్ణగౌడ్, మాజీ ఎస్ఎఫ్ సెక్రటరీ రమణారావు, మాజీ డివైఎస్ఓ ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్
- నల్ల పోచమ్మ ఆలయ నిర్మాణ పనులకు భూమిపూజ



నవతెలంగాణ-దస్తురాబాద్

రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తోందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం మండలంలోని దేవుని గూడెం గ్రామంలో రూ.9 లక్షల 50 వేల నిధులతో నిర్మించనున్న నల్ల పోచమ్మ ఆలయ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సబ్బండవర్గాల అభ్యున్నతికి కృషి చేస్తోందని, గ్రామాల అభివృద్ధికి పార్టీలకతీతంగా పాటుపడాలని అన్నారు. ఈ ప్రాంత అభివృద్ధే లక్ష్యంగా కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం పల్లెబాట, పొద్దు పొడుపు బొజ్జన్న అడుగు ఫోన్ ఇన్ కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. గ్రామంలో ఏ సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకోస్తే వాటి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. త్వరలో ప్రజా పాలన కార్యక్రమం ఉంటుందన్నారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దుర్గం మల్లేష్, యూత్ అధ్యక్షులు నరేష్, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్, ఎంపీపీ కిషన్, రమేష్‌రావు, మాజీ సర్పంచ్ అంజన్న, రంజిత్, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నవరాత్రి ఉత్సవాలను పకడ్బందీగా నిర్వహించాలి

- మున్సిపల్ చైర్మెన్ రాజుర సత్యం



నవతెలంగాణ-ఖానాపూర్

సెప్టెంబర్ నెలలో జరగబోయే నవరాత్రి ఉత్సవాలను మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పకడ్బందీగా నిర్వహించాలని మున్సిపల్ చైర్మెన్ రాజుర సత్యం అన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో ఆయన సభ్యులతో మాట్లాడుతూ ఖానాపూర్ పట్టణంలో సెప్టెంబర్ నెలలో జరగబోయే వినాయక ప్రతిష్టాపన మండపాల వద్ద విద్యుత్ స్తంభాలకు డీపీలు, లైటింగ్‌ల ఏర్పాటుపై చర్చించారు. గణేష్‌ల నిమజ్జనం రోజున గోదావరి నది తీరం వద్ద గజ ఈతగాళ్ల ఏర్పాటు, క్రేన్ వాహనం, గోదావరి నది తీరం వద్ద టెంటు కుర్చీల ఏర్పాటు, నిమజ్జనం రోజున ప్రధాన వీధులలో తాగునీటి ఏర్పాటు పలు అంశాలపై చర్చించారు. ఖానాపూర్ పట్టణంలోని అన్ని వార్డులలో ప్రజలు సీజనల్ వ్యాధులకు గురవుతున్నారని వాటిని దృష్టిలో ఉంచుకొని దోమలు ఏర్పడకుండా దోమల స్ప్రే పిచికారి, రాత్రి వేళలలో ఫాగింగ్ దోమల పొగ పిచికారి కొరకై కౌన్సిల్ సమావేశంలో తీర్మానించారు. ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సహకారంతో ఖానాపూర్ పట్టణంలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్స్ నాయకులు కారింగుల సంకీర్తన, జన్నారపు విజయలక్ష్మి, పరిమి లత, కిషోర్ నాయక్, అబ్దుల్ కలీల్, కుర్మా శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ మనోహర్, మున్సిపాలిటీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తులు సంచరిస్తే సమాచారమివ్వాలి

- బైంసా రూరల్ సీఐ నైలు



నవతెలంగాణ-కుభీర్

ఇటీవల గ్రామాల్లో గుర్తుతెలియని వ్యక్తులు సంచరిస్తున్నారని, దీంతో పాటు చైన్‌స్నాచింగ్, సైబర్ క్రైంలు జరుగుతున్నాయని భైంసా రూరల్ సీఐ నైలు అన్నారు. శనివారం మండలంలోని చాత గ్రామంలో కమ్యూనిటీ ప్రోగ్రామ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గ్రామంలో పోలీసు సిబ్బందితో విస్తృతంగా తనిఖీలు నిర్వహించడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా గ్రామంలో 52 ద్విచక్ర వాహనాలను పరిశీలించగా, అందులో పత్రాలు లేని వాహనాలకు, సీజ్ చేయడంతో పాటు చలాన్‌లు ఉన్నవాటి చలాన్‌లను కట్టించారు. ఈ సందర్భంగా సీఐ నైలు మాట్లాడుతూ గ్రామంలో ఉన్న ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా పోలీసులు ఉన్నారని తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు తిరుగుతున్నట్లైతే వెంటనే పోలిసులు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. అదే విధంగా గత కొన్ని రోజుల నుంచి ఎక్కువగా చైన్‌స్నాచింగ్ జరుగుతున్నాయని అన్నారు. రానున్న గణేష్ ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలను నిర్వహించుకోవాలని అన్నారు. ముందుగా గణేష్ మండపాల నిర్వాహకులు విద్యుత్, పోలీసులు అధికారులకు సమాచారం అందిస్తే వారికి మండపాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేసేలా చూస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కుభీర్ ఎస్సై రవీందర్, కుంటాల ఎస్సై భాస్కర్‌చారి, భైంసా ఎస్సై శ్రీనివాస్, భైంసా రూరల్ పోలిస్ సిబ్బంది ఉన్నారు.

కళాశాల విద్యార్థుల క్షేత్ర పర్యటన





నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డా.శ్రీధర్ చౌహాన్ ఆధ్వర్యంలో శనివారం కళాశాల విద్యార్థులను క్షేత్ర పర్యటనలో భాగంగా గులాబ్‌సింగ్, చింతగూడ గ్రామం, గుడిహత్నూర్ మండలం రైతు వ్యవసాయ క్షేత్రం పరిశీలించారు. అందులో భాగంగా పత్తిలో అధిక సాంద్రతలో పత్తిసాగు అంతర కృషి ఎరువులను వేసే విధానం, తైవాన్ జామ సాగు వివరాలు రకం, మామిడిలో వివిధ రకాల యాజమాన్య పద్ధతులు, ఆయిల్ ఫాంలో అంతర పంట సాగు వంటి అంశాలపై విద్యార్థులకు పరిశీలనాత్మకంగా చూపిస్తూ అవగాహన కల్పించారు. రైతు తన 20 ఎకరాల సాగు అనుభవాలను విద్యార్థులకు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ ఇటువంటి అవగాహన కల్పించినందుకు రైతుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు, భోధన సిబ్బంది ప్రొఫెసర్ డా. రాజేశ్వరి, ప్రొఫెసర్ డా. భానురేఖ, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. సురేష్, ఇతర ఒప్పంద అధ్యాపక సిబ్బంది డా.రాథోడ్ సునీల్ కుమార్, జె.రాకేశ్, కె.మౌనిక, అపూర్వ, సాయి కిరణ్ పాల్గొన్నారు.

గద్దర్ అవార్డుకు నర్సమ్మ ఎంపిక



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

ఆగస్టు 30న తొర్రూర్‌లో జరిగిన గిద్దె గళం ఆధ్వర్యంలో గద్దర్ అవార్డుకు ఆదిలాబాద్‌కు చెందిన కళాకారిణి నర్సమ్మ ఎంపికైంది. ఈ గద్దర్ పురస్కారాన్ని గద్దర్ అన్న కూతురు వెన్నెల, ప్రొఫెసర్ కాశీం, అదేవిధంగా గిద్దె రామ్ నర్సన్న, దరువు ఎల్లన్న చేతుల మీదగా శాలువాతో ఘనంగా సన్మానించి, మెమోంటో అందజేశారు. గద్దర్ అవార్డుకు ఎంపిక కావడంతో నర్సమ్మ సంతోషాన్ని వ్యక్తం చేసింది.

ఎల్‌ఆర్‌ఎస్ సర్వే ప్రారంభం

నవతెలంగాణ-బోథ్

మండలంలోని ఎల్‌ఆర్‌ఎస్ సర్వేను అధికారులు ప్రారంభించారు. గతంలో 2000 సంవత్సరంలో ఇండ్ల స్థలాలపై ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు చేసుకున్న వాటికి స్థలాన్ని పరిశీలించి, కొలతలు చేస్తున్నట్టు ఆర్ఐ సునీత తెలిపారు. శనివారం మండలంలోని పొచ్చర గ్రామపరిదిలో ఉన్న ఇండ్ల స్థలాలను పరిశీలించారు. అలాగే కొలతలు తీసుకొని, ప్రభుత్వానికి ప్రతిపాదన పంపిస్తున్నట్టు తెలిపారు. మండలంలోని గ్రామపంచాయతీ పరిధిలోని పంచాయతీ సెక్రటరీలకు సమాచారం ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇండ్ల స్థలాల లబ్దిదారులు తమ తమ ఇండ్ల స్థలాల హద్దులు పెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ జాదవ్ వెంకట్, పంచాయతీ కార్యదర్శి డిజి. గంగాధర్ పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ కార్యాలయ ఏర్పాటుకు పరిశీలన

నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీఓ కార్యాలయం భవనంపైన పంచాయతీ రాజ్ కార్యాలయం ఏర్పాటుకు స్థలాన్ని శనివారం ఇన్‌చార్జీ ఎంపీడీఓ జీవన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మెన్ బొడ్డు రంగారెడ్డి పరిశీలించారు. మండల కేంద్రంలో పంచాయతీరాజ్ డివిజన్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు గట్ల గంగాధర్, షేక్ అబుద్ పాల్గొన్నారు.

ఎలాంటి ఆంక్షలు లేకుండా రూ.2లక్షలు రుణమాఫీ చేయాలి



నవతెలంగాణ-బోథ్

ఎలాంటి ఆంక్షలు లేకుండా రూ.2లక్షలు రుణమాఫీ చేయాలని ఆల్ ఇండియా కిసాన్ మహాసభ ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి చిల్క దేవిదాస్ అన్నారు. శనివారం ఆయన ఆధ్వర్యంలో తహసీల్దార్ సుభాష్ చంద్రాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.2లక్షలలోపు రుణమాఫీ ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో జరగలేదని, వెంటనే దానిపై సర్వే నిర్వహించి, రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలు పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి సిరిపురం దాస్, సీపీఐ బోథ్ నియోజకవర్గ కార్యదర్శి బి.గోవర్ధన్, నాయకుడు భోజన్న పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు సీఈఓ, హజ్ కమిటీ సభ్యులకు సన్మానం

నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రానికి వచ్చిన వక్ఫ్ బోర్డు సీఈఓ షేక్ లియాఖత్ హుస్సేన్, హజ్ కమిటీ సభ్యుడు ఆసిఫ్‌లను శనివారం మండల కేంద్రంలో సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బానోత్ గజానంద్ నాయక్ మైనారిటీ నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు హసన్‌ఖాన్, ప్యాక్స్ ఇన్‌చార్జ్ చైర్మెన్ అడే సురేష్, దాదే అలీ, సయ్యద్ ఖాసిం, దస్తగిరి, హరిచంద్, ఫిరోజ్‌ఖాన్, అల్తాఫ్ ఖాన్, బాబాఖాన్, ముసాబీర్, అవినాష్, కరీంఖాన్, దయానంద్ ఉన్నారు.

ఎన్నికలపై విద్యార్థులకు అవగాహన

నవతెలంగాణ-నార్నూర్



ఎన్నికలు ఎలా నిర్వహించాలి, ఓటు ఎలా వేయాలనే దానిపై శనివారం మండల కేంద్రంలోని ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రతి ఏడాది లాగా విద్యార్థులకు కెప్టెన్ వైస్ కెప్టెన్‌గా ఎన్నికలు నిర్వహించారు. నాయకత్వ లక్షణాలు ఎలా అలవర్చుకోవాలో వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జాదవ్ విఠల్, ఆడే విశ్వనాథ్, వనిత, జి శంకర్, బి.సురేష్ సింగ్, బి.వంశీ, సీహెచ్ గంగా, జె.విజయ, ఆర్ అనిత, ఉజ్వల, శ్రీకాంత్ విద్యార్థులు ఉన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-నార్నూర్

లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీఓ స్వప్నశీల, గాదిగూడ ఎంపీఓ సాయిప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత మూడు రోజుల పాటుగా భారీ వర్షం ఉండటంతో మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. భారీ వర్షం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు ఉన్నందున ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని తెలిపారు. శిథిలావస్థలో ఉన్న ఇండ్లలో ఉండకూడదని, ఇలా ఎవరైనా ఉంటే వారిని వారి బంధువుల ఇంటికి తరలివెళ్లాలని తెలిపారు. గ్రామ పంచాయతీ బాధ్యత తీసుకొని వారికి భోజన వసతి కల్పించాలన్నారు. గ్రామంలో ఎవరూ కూడా వాగులు, చెరువులు దాటే ప్రయత్నం చేయకూడదని తెలియజేశారు. చేపల కోసం ఎవరూ కూడా చెరువుల వద్దకు వెళ్లకూడదని పేర్కొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
ఆదివారం | 01 సెప్టెంబర్, 2024 | www.navatelangana.com

ఎమ్మెల్యే కోవలక్ష్మికి పరామర్శల వెల్లువ

నవతెలంగాణ-ఆసిఫాబాద్



రెండు రోజుల క్రితం తీవ్ర అస్వస్థతకు గురై హైదరాబాద్ యశోద ఆస్పత్రిలో చికిత్స పొంది శనివారం డిశ్చార్జ్ అయి హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌కు వెళ్లిన ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మికి పరామర్శల వెల్లువ కొనసాగుతోంది. శనివారం మాజీ మంత్రి హరీష్ రావుతో పాటు అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, మాజీ ఎమ్మెల్యే, మాజీ జడ్పీ చైర్మన్ పుట్ట మధు, మాజీ చీఫ్ వీప్ సునీత మహేందర్ రెడ్డి ఎమ్మెల్యే క్వార్టర్స్‌కు వెళ్లి ఆమెను పరామర్శించి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

పాఠశాలకు సెలవు ప్రకటించాలి

నవతెలంగాణ-తిర్యాణి



ఆదివాసీ సంస్కృతి సాంప్రదాయాలు ఉట్టిపడేలా నిర్వహించుకొనే పొలాల పండుగకు స్థానిక పాఠశాలకు సెలవు ప్రకటించాలని తుడుందెబ్బ నాయకులు కోరారు. శనివారం సంఘం ఆధ్వర్యంలో ఎంఈఓ కార్యాలయం సిబ్బందికి నాయకులు వినతిపత్రం అందజేశారు. పొలాల సందర్భంగా పాఠశాలలకు సెలవు ప్రకటించే విధంగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో తుడుం దెబ్బ నాయకులు వేడ్మ భగవంత్‌రావు, గేడం సుభాష్, తొడసం భాస్కర్, రాయసిడం రాంపాలు పాల్గొన్నారు.

వర్షానికి కూలిన ఇల్లు



నవతెలంగాణ-తిర్యాణి

మండలంలోని కోయ తలండి గ్రామానికి చెందిన ఆత్రం గోపాల్ ఇల్లు శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పూర్తిగా కూలిపోయింది. ఇల్లు కూలిపోయే సమయానికి ఇంట్లో ఎవరు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. నిరుపేద కుటుంబానికి చెందిన తనను ప్రభుత్వమే ఆదుకోవాలని బాధితుడు గోపాల్ కోరుతున్నాడు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన



నవతెలంగాణ-వాంకిడి

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో శనివారం ఎస్పీ శ్రీనివాస్ ఆదేశాల మేరకు పోలీస్ కళాజాత బృందం కళాజాత ప్రదర్శన నిర్వహించడం జరిగిందని ఎస్ఐ ప్రశాంత్ తెలిపారు. విద్యార్థులకు సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, కుటుంబ నియంత్రణ చర్యలు, చదువు ప్రాధాన్యత, యువత చెడు అలవాట్లకు బానిసలుగా మారకూడదని, మహిళల భద్రత తదితర అంశాలపై ఆటపాటల రూపంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. పోలీస్ కళాజాత ప్రదర్శన విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యరకమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రుణమాఫీకాని రైతుల నుండి ఫిర్యాదుల స్వీకరణ



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

రుణమాఫీ కానీ రైతుల నుండి మండల వ్యవసాయ శాఖ అధికారులు ఫిర్యాదులను స్వీకరిస్తున్నారు. శనివారం మండల కేంద్రంలోని రైతువేదికలో రేషన్ కార్డు లేక రుణమాఫీ కానీ రైతుల దగ్గర నుండి కుటుంబ వివరాలపై ఫిర్యాదులు స్వీకరించారు. ఫిర్యాదులను రైతు భరోసా యాప్‌లో అప్లోడ్ చేస్తున్నట్లు వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీవిద్య తెలిపారు. రైతులు ఎవరైనా రేషన్ కార్డు లేక రూ.2 లక్షల వరకు రుణమాఫీ కానట్లయితే తమను సంప్రదించాలన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో మోడల్ ఎన్నికలు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ మండలం రాస్పెల్లి జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో విద్యార్థులకు ఎన్నికల పట్ల అవగాహన కల్పించేందుకు గాను మోడల్ ఎన్నికలను శనివారం నిర్వహించారు. స్కూల్ లీడర్‌ను ఎన్నుకునేందుకు గాను నిర్వహించిన ఈ ఎన్నికలలో పోటీ చేసిన విద్యార్థులకు గుర్తులను కేటాయించారు. వీరు తోటి విద్యార్థుల వద్దకు వెళ్లి తనకే ఓటు వేయాలని ప్రచారం చేశారు. 6 నుండి 10వ తరగతి వరకు 170 మంది విద్యార్థులు ఉండగా, పోటీ చేసిన ఉల్లి అరవింద్‌కు 87, తవిటి కీర్తనకు 32 ఓట్లు వచ్చాయి. దీనితో ఉల్లి అరవింద్ 55 ఓట్ల మెజార్టీతో గెలిచి స్కూల్ లీడర్‌గా ఎంపికయ్యాడు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎక్కలదేవి నాగరాణి, రవికుమార్, సత్యనారాయణ, స్వామి, హస్మి, వనిత పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన క్లర్క్‌కు సన్మానం

నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియా ఖైరగూడ ఓపెన్ కాస్ట్‌లో ఉద్యోగ విరమణ పొందిన క్లర్క్ కుమార్‌ను ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఖైర్‌గూడ ఫిట్ సెక్రెటరీ మారం శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి కార్మికుని జీవితంలో ఉద్యోగ విరమణ రోజు వస్తుందని అలాగే 40 సంవత్సరాలుగా కార్మికులతో ఉండి దిగిపోయేటప్పుడు బాధ కూడా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఖైరిగూడ ప్రాజెక్టు ఆఫీసర్ నరేందర్, కాలరీ మేనేజర్ శంకర్, ప్రాజెక్ట్ ఇంజనీర్ వీరన్న, ఎస్ఓ నారాయణ, సీనియర్ పీఓ వేణు, ఏఐటీయూసీ ఆర్గనైజింగ్ సెక్రటరీలు కిరణ్ బాబు, మీసా చంద్రశేఖర్, కాంటాక్ట్ కార్మిక బ్రాంచ్ కార్యదర్శి సల్లూరి అశోక్, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ మాల ఓదెలు, రిలే ఏ షిఫ్ట్ ఇన్‌చార్జి రాయిని రాజయ్య పాల్గొన్నారు.



విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-సిర్పూర్(టి)

వర్షకాలం వ్యాధులు ప్రబలే కాలమని ఈ క్రమంలో వసతి గృహాల్లోని విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శనివారం మండల కేంద్రంలో గల సాంఘిక సంక్షేమ బాలుర పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులకు అందిస్తున్న భోజనం, వంటశాల, వసతి గృహ పరిసరాలు పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగ కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించి నాణ్యమైన విద్య అందించేందుకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. పాఠశాలలు, వసతి గృహాలలో విద్యార్థులకు మెనూ ప్రకారం పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని సూచించారు. వర్షాకాలం అయినందున విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పాటించాల్సిన జాగ్రత్తలను వివరించాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో పాటు ఆహారం తీసుకునే ముందు తప్పనిసరిగా చేతులు శుభ్రపరచుకునేలా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. విద్యార్థులతో మాట్లాడుతూ పాఠశాలలో అందిస్తున్న సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకుని వారి పఠన సామర్థ్యాలను పరీక్షించారు. ఇష్టపడి చదవాలని, ఉన్నతమైన లక్ష్యాలను ఎంచుకొని వాటిని సాధించే దిశగా ఏకాగ్రత, పట్టుదలతో కృషి చేయాలన్నారు. తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి సత్యనారాయణ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగికి విరమణ సహజం

- ఎస్పీ డీవీ శ్రీనివాసరావు



ఉద్యోగ విరమణ పొందిన ఎస్సై దంపతులను సత్కరిస్తున్న ఎస్పీ డీవీ శ్రీనివాస్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రభుత్వ ఉద్యోగికి ఉద్యోగ విరమణ సహజమని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. పోలీస్ విభాగంలో ఎస్సైలుగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన ప్రకాష్ చంద్ర మిశ్రి, ఎం.రాములులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ విరమణ పొందుతున్న వారు ఎంతో సేవ చేశారని కొనియాడారు. ప్రభుత్వ ఉద్యోగికి విరమణ సహజమన్నారు. ఉద్యోగంలో ఉన్నప్పుడు మనం చేసిన సేవ కార్యక్రమాలు తర్వాత జీవితంలో ప్రజలకు గుర్తుండిపోతాయన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం శేష జీవితం కుటుంబ సభ్యులతో సుఖసంతోషాలతో గడపాలని కోరుకున్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ప్రభాకర్ రావు, ఇన్స్పెక్టర్లు రాణాప్రతప్, పెద్దయ్య, అంజన్న, జిల్లా పోలీస్ సంఘం అధ్యక్షులు విజయ శంకర్ రెడ్డి, ఏఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నవరాత్రి ఉత్సవాలకు ప్రత్యేక బందోబస్తు

జిల్లాలో జరగనున్న గణేష్ నవరాత్రి ఉత్సవాలకు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ డీవీ శ్రీనివాసరావు తెలిపారు. జిల్లాలో 800 మంది పోలీస్ అధికారులను సిబ్బందిని మండలాల్లో ప్రత్యేకంగా నియమించినట్లు వివరించారు. జిల్లావ్యాప్తంగా 1200 ప్రత్యేక సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. గణేష్ మండపాలకు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, ఇది కేవలం మండపానికి సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి మాత్రమే రూపొందించబడిందన్నారు. దీనిద్వారా అవసరమైన భద్రత ఏర్పాట్లు చేసే అవకాశం ఉంటుందన్నారు. పోలీస్‌పోర్టల్.టీఎస్‌పోలీస్.జీఓవీ.ఇన్‌లో వివరాలు పొందుపరచి అప్లికేషన్‌ను సంబంధిత పోలీస్ స్టేషన్‌లో అందించాలని సూచించారు.

అంగన్‌వాడీలో మౌలిక వసతులకు చర్యలు

- అదనపు కలెక్టర్ దీపక్ తివారీ



నవతెలంగాణ-రెబ్బెన

ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, పిల్లల సంక్షేమానికి అనేక చర్యలు తీసుకుంటుందని, ఈ క్రమంలో కేంద్రాలలో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. శనివారం మండలంలోని నంబాల అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. కేంద్రంలోని రిజిస్టర్, పరిసరాలు, పిల్లలకు అందిస్తున్న పోషక ఆహారం నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లల సంరక్షణకు కృషి చేయడం జరుగుతుందని, ఈ నేపథ్యంలో కేంద్రాలలో మరుగుదొడ్లు, మూత్రశాలలు, తాగునీరు, విద్యుత్ సరఫరా, పిల్లలకు ఆట బొమ్మలు ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని పంచాయతీరాజ్ ఏఈని ఆదేశించారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వార్డులు, మందుల నిలువలు, రిజిస్టర్‌లను పరిశీలించి అందుతున్న వైద్య సేవలపై రోగులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు పాటించాల్సిన జాగ్రత్తలపై వైద్యులు ప్రజలకు అవగాహన కల్పించాలని, విష జ్వర బాధితులకు అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రజలకు వైద్య సేవలు అందించాలన్నారు. అదే విధంగా సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను సందర్శించి విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేశారు. ప్రభుత్వ పాఠశాలలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తూ నాణ్యమైన విద్యను అందించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. విద్యార్థులకు సమయానుసారంగా మెనూ ప్రకారం పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలన్నారు. పాఠ్యాంశాల బోధనపై విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, వార్షిక పరీక్షలలో ఉన్నత ఫలితాల సాధన దిశగా కృషి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రామ్మోహన్‌రావు, ఆర్ఐ ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు

రాజ్యాధికారమే లక్ష్యంగా ముందుకు సాగుదాం

- పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కమర్తపు మురళి



మాట్లాడుతున్న పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కమర్తపు మురళి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పద్మశాలీలకు చట్టసభల్లో రాజకీయవాటే ధ్యేయంగా రాజ్యాధికారమే లక్ష్యంగా ముందుకు సాగాలని పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కమర్థపు మురళి అన్నారు. జిల్లా కేంద్రంలోని పద్మశాలి భవనంలో జిల్లా అధ్యక్షుడు ఇరుకుల్ల ఆంజనేయులు అధ్యక్షతన నిర్వహించిన జిల్లా సమావేశానికి రాష్ట్ర నాయకులు గడ్డం జగన్నాథం, అవ్వారి భాస్కర్, మాచర్ల రామచందర్‌తో కలిసి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2028లో వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో చట్టసభల్లో రాజకీయ వాటా కోసం పద్మశాలి సమాజాన్ని చైతన్యవంతం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులు, అనుబంధ కార్మికులు పొదుపు చేసిన రెండువేల మొత్తానికి ప్రభుత్వం 4000 జమ చేసే ప్రభుత్వ వాటా గత కొన్ని నెలలుగా పేరుకపోయిన బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసినందుకు చేనేత వర్గాలలో ఆనందం వెల్లువిరిసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాతనే నేతన్న భీమాకు రూ.6 కోట్లు, బతుకమ్మ చీరల బకాయిలు రూ.150 కోట్లు, చేనేత సహకార సంఘాల బకాయిలు రూ.25 కోట్లతో పాటు ఎల్ఐసీ నిబంధనల ప్రకారం నేతన్న భీమా వర్తించని చేనేత కార్మికులకు ప్రభుత్వం రూ.ఐదు లక్షల ఎక్స్గ్రేషియా అందించేందుకు త్వరలో విధివిధానాలు ఖరారు చేయనున్నట్లు మంత్రి తుమ్మల ప్రకటించారని తెలిపారు. దీనికి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం నిర్ణయం ద్వారా 36133 మంది కార్మికులకు ప్రత్యక్షంగా లబ్ధి చేకూరనుందన్నారు. కొంతమంది పద్మశాలి సమాజాన్ని తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని, అటువంటి వాటిని నమ్మకూడదన్నారు. ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ నెలకొల్పిన తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘంతో మనమంతా కలిసి ముందుకు పోదామని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం గౌరవాధ్యక్షులు మెతుకు సత్యం, కోశాధికారి బొమ్మ రఘురాం నేత, వాసల రమేష్ సెక్రెటరీ జెల్ల నరేందర్, సంగారెడ్డి జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షులు హరిహర కిషన్, రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి గడదాస్ మల్లయ్య, గౌరవాధ్యక్షులు సామల రాజయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ మారిన వెంకటేశ్వర్లు, నల్ల కనకయ్య, కొంగ సత్యనారాయణ, కుడిక్యాల రాజమౌళి, పొన్న శంకర్, మాచర్ల శ్రీనివాస్, బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఆవిడపు ప్రణయ్, అనుమల్ల శ్రీకాంత్, కోమటిపల్లి లింగయ్య, పద్మశాలి సంఘం నాయకులు, ప్రముఖులు పాల్గొన్నారు.

పీడీ యాక్ట్ నమోదుకు అక్రమార్కుల జాబితా సిద్ధం

- ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లాలో అక్రమ కార్యక్రమాల నిర్మూలనలో భాగంగా అక్రమ కార్యక్రమాలకు పాల్పడే వారి జాబితా సిద్ధం చేసినట్టు, వారిపై పీడీయాక్ట్ నమోదు చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ డీవీ శ్రీనివాసరావు తెలిపారు. భూ కబ్జాలకు పాల్పడేవారు, అక్రమంగా భూమిని ఆక్రమించి యజమానులను బెదిరించేవారు, లైసెన్స్ లేకుండా అధిక వడ్డీలకు ఫైనాన్షియల్ చిట్టీలు నడుపుతున్న వారు, చైన్ మార్కెటింగ్ పేరుతో డబ్బులు వసూలు చేసి తర్వాత సంస్థను ఎత్తేసిన వారు, జిల్లాలో ఆన్‌లైన్ ద్వారా రెట్టింపు డబ్బులు ఇస్తామని మోసం చేసిన వారు, అక్రమంగా పశువులను రవాణా చేసిన వారి జాబితా సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. వారిపై పీడీ యాక్ట్ చట్టం ప్రకారం కేసు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా జిల్లాలో ఎవరైనా అక్రమ కార్యకలాపాలకు పాల్పడుతున్నట్టు సమాచారం ఉంటే 100 లేదా 8712670505కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

పొలాల పండుగకు కిటకిటలాడుతున్న దుకాణాలు



నవతెలంగాణ-వాంకిడి

మరో నాలుగు రోజుల్లో పొలాల పండుగ రానుంది. రైతులు పొలాల పండుగ సందర్భంగా ఎద్దులకు అలంకరించే వస్తువులను కొనుగోలు చేయడానికి మండలకేంద్రంలోని దుకాణాలకు రావడంతో కిటకిటలాడుతున్నాయి. రైతులు ఎద్దులను రకరకాల వస్తువులతో ముస్తాబు చేసేందుకు దుకాణాల వద్దకు వెళ్లి అలంకరణ వస్తువులను కొనుగోలు చేస్తున్నారు. దీంతో దుకాణాల వద్ద పండుగ వాతావరణం నెలకొంది.

బూత్ స్థాయిలో సభ్యత్వాలు చేయాలి



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

ప్రతి ఒక్క కార్యకర్త బూత్ స్థాయిలో పార్టీ సభ్యత్వాలను చేయించాలని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ వీరభద్ర చారి అన్నారు. మండల కేంద్రంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం సందర్భంగా కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు, ప్రతి ఒక్క కార్యకర్త పార్టీ సభ్యత్వాలను చేయించాలన్నారు. గ్రామాల్లో బూత్ స్థాయిలో పెద్ద ఎత్తున సభ్యత్వాలు చేసి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపుకు కలసి కట్టుగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు జునుగరీ మధుకర్, ఓ.బీసీ జిల్లా అధ్యక్షులు చప్పిడి సత్యనారాయణ, జిల్లా అధికార ప్రతినిధి సమీర్ గుప్తా, ప్రధాన కార్యదర్శులు కుకుడే రాజేష్, మహేష్, శక్తి కేంద్ర ఇన్‌చార్జి గణపురం నాగేష్, కదంబ శ్రీనివాస్, జడి శ్రీనివాస, ఓబీసీ మండల అధ్యక్షులు భుజంగ రావు, నాయకులు బండి ప్రభాకర్, బోయిర్ నానయ్య, భాస్కర్, పురుషోత్తం, శ్రీకాంత్, పాలే సంతోష్, కాంతారావు, రాకేష్, బూత్‌అధ్యక్షులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన సదస్సులు నిర్వహించాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

సీనియర్ సిటిజన్ల సంక్షేమ చట్టం-2007పై అధికారులు, సామాజిక కార్యకర్తలు, సీనియర్ సిటిజన్లు, విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు సదస్సులు నిర్వహించాలని తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోషియేషన్ రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ, సభ్యులు ఎఎస్ఆర్ మూర్తి, రమణయ్య, నాగేశ్వర్‌రావు, కోటేశ్వర్, చిలుక లక్ష్మీనారాయణ, పురుషోత్తం ఒక ప్రకటనలో కోరారు. కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రతి మండల కేంద్రంలో అవగాహన సదస్సులు నిర్వహించి పెద్దల పట్ల గౌరవం, వారి సంరక్షణ, సంక్షేమాల గురించి అవగాహన కల్పించాలని వారు కోరారు. ఈ మేరకు శనివారం కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు.

హజ్ యాత్రకు వెళ్తున్న ఆదిల్‌కు స్వాగతం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు నుండి కాలినడకన పవిత్ర హజ్ యాత్రకు పయనమైన అబ్దుల్ ఆదిల్ శనివారం ఆసిఫాబాద్‌కి పాదయాత్రగా చేరిన సందర్భంగా మైనారిటీ యువకులు పూల మాలలు వేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అబ్దుల్ ఆదిల్ మాట్లాడుతూ పవిత్ర హజ్ యాత్ర 8500 కిలోమీటర్లు ఉంటుందని, ఈనెల 12న తన ఇంటి నుండి ప్రారంభమైన పాదయాత్ర నేటితో 400 కిలో మీటర్లు నడిచానన్నారు. మిగతా 8100 కిలోమీటర్లు నడవాలని ఇండియా, పాకిస్తాన్ మీదుగా ఈ పాదయాత్ర కొనసాగిస్తానన్నారు. ప్రతిరోజు 20 నుండి 25 కిలోమీటర్లు పాదయాత్ర చేస్తున్నానని తనకు ప్రతి గ్రామంలో ముస్లిం యువకులు స్వాగతం పలుకుతూ చేరదీస్తున్నారన్నారు. అనంతరం ముస్లిం వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ముస్లిం వెల్ఫేర్ సొసైటీ గౌరవ అధ్యక్షుడు అహమ్మద్ బిన్ అబ్దుల్లా, సొసైటీ అధ్యక్షుడు ఉబెద్ బీన్ యాహియా, నాయకులు అబ్దుల్ రహమాన్, సయ్యద్ నిసార్, ఎండీ అహ్మద్, ఉబెద్ బీన్ యాహియ, అబ్దుల్ హన్నాన్, హరుణ్, ఖిజర్, సలీం, ఇమ్రాన్, తాజ్, ముబాషీర్ పాల్గొన్నారు.



దోమల నియంత్రణకు చర్యలు చేపట్టండి

నవతెలంగాణ-తాండూర్



పంచాయితీల్లో దోమల నియంత్రణకు చర్యలు చేపట్టాలని ఎంపీఓ అనిల్ సూచించారు. శనివారం మండలంలోని రేచిని గ్రామపంచాయతీని ఆయన సందర్శించారు. పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహిస్తూ దోమల నియంత్రణకు చర్యలు చేపట్టాలని సూచించారు. పంచాయతీల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లాలని తెలిపారు. వాటర్ ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. పల్లె ప్రకృతి వనాల్లో క్రీడామైదానాల్లో గడ్డిని తొలగించాలని సూచించారు. రేచీని గ్రామపంచాయతీలోని వైకుంఠధామంను పరిశీలించారు. రేచిని 4 అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లల హాజరు నమోదును పరిశీలించారు. ఉడికించిన గుడ్లను రెండు ముక్కలు చేసి పిల్లలకు అందించాలని తెలిపారు. ఆయనతో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ ఉన్నారు.

కుట్టు మిషన్లు, సైకిళ్ల పంపిణీ

నవతెలంగాణ-కాసిపేట



మండలంలోని దేవాపూర్‌లో ఓరియంట్ గోల్డ్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గట్రావుపల్లి, గురువాపూర్ మహిళలకు కట్టు మిషన్లు అందించారు. దేవాపూర్ ప్రభుత్వ పాఠశాలలోని ఇద్దరు విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేశారు. కట్టు మిషన్లు జీవన ఉపాధికి ఉపయోగపడుతాయని, సైకిళ్లు విద్యార్థులకు నడిచే సమస్య లేకుండా సమయానికి పాఠశాలకు రావడానికి ఉపయోగపడుతాయని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎల్సీఐఎఫ్ జిల్లా కోఆర్డినేటర్ గొంది వెంకటరమణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఓరియంట్ గోల్డ్ లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు గొంది లక్ష్మీ ప్రసన్న, ఉపాధ్యాక్షురాలు మడావి విజయలక్ష్మీ, కార్యదర్శి బిసాల్ సునీతాదేవి, పూస్కూరి విక్రంరావు, నాంసాని రాజేంద్రప్రసాద్, ఉటూరి సాయి కుమార్, మడావి వెంకటేశ్, కసాడి భూమయ్య పాల్గొన్నారు.

ఎల్లంపల్లి గేట్లు ఎత్తివేత..?

- పూర్తి నీటి సామర్థ్యం దిశగా ప్రాజెక్ట్
- ఏ క్షణమైనా గేట్లు ఎత్తివేస్తామంటూ అధికారుల ప్రకటన

నవతెలంగాణ-హాజీపూర్

ఎగువన కురుస్తున్న వర్షాలతో పాటు కడెం ప్రాజెక్ట్ గేట్లు ఎత్తివేయడంతో ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌లోకి వరద నీరు భారీగా వచ్చి చేరుతుంది. ప్రాజెక్ట్ నిర్మాణం మొదలైన నాటి నుండి ఆగస్టు నెలాఖరు వరకు గేట్లు తెరవక పోవడం ఇదే మొదటి సారి. ఈ ఏడాది వర్షాలు లేకపోవడంతో ప్రాజెక్ట్‌లోకి నీరు చేరలేదు. ఎగువన వస్తున్న వరద నీటికీ సమానంగా నంది పంప్ హౌస్ నుంచి నీటిని మిడ్ మనేరుకు తరలింపు ప్రక్రియ కొనసాగుతుంది. ఇప్పటి వరకు ఎల్లంపల్లి నుంచి సుమారు 20 టీఎంసీల నీటిని మిడ్ మానేరుకు తరలించారు. ప్రాజెక్ట్ పూర్తి నీటి సామర్థ్యం 20 టీఎంసీలు కాగా 18 టీఎంసీలు దాటింది.

గేట్లు ఎత్తే అవకాశం..?

ఈ ఏడాది వర్షాకాలం సీజన్‌లో ఇప్పటి వరకు ప్రాజెక్ట్ గేట్లు ఎత్తలేదు. కానీ ప్రస్తుతం ప్రాజెక్ట్‌లోకి భారీగా వరద నేరు వచ్చి చేరుతుంది. మరో మూడు రోజులు భారీ వర్షాలున్నాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో శనివారం రాత్రికి ప్రాజెక్ట్ గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదిలే అవకాశం వుందని అధికారులు ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం ఎల్లంపల్లిలో 18 టీఎంసీ నీరు నిలువ వుండగా వరద రూపంలో 14 లక్షల క్యూసెక్కుల నీరు ప్రాజెక్ట్‌లోకి వచ్చి చేరుతుంది. 6 వేల టీఎంసీల నీటిని నంది పంప్ హౌజ్ నుంచి మిడ్ మానేరుకు తరలిస్తున్నారు. ఇన్ ఫ్లో ఎక్కువ వుండడం తో శనివారం రాత్రి గేట్లు తెరిచే అవకాశం ఉంది. ఈ ఏడాది ప్రాజెక్ట్ గేట్లు తెరవడం ఇదే మొదటి సారి. కాగా దిగువ ప్రాంతాల ప్రజలను హెచ్చరిస్తూ ప్రాజెక్ట్ అధికారులు శనివారం రాత్రి హెచ్చరికలు జారీ చేశారు.

నిరుపేద కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన నిరుపేద ఆటో డ్రైవర్ గుండా సురేష్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఆ గ్రామ జనతా యూత్ అధ్యక్షుడు నీలం శేఖర్ అన్నారు. ఆటో డ్రైవర్ గుండా సురేష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆ కుటుంబానికి శనివారం జనతా యూత్ ఆధ్వర్యంలో రూ.3000 ఆర్థిక సాయం అందజేశారు. సందర్భంగా వారు మాట్లాడుతూ జనతా యూత్ ఆధ్వర్యంలో నిరుపేదలను ఆదుకుంటామన్నారు. పేద ప్రజలకు అండగా నిలుస్తామని, దాతలు ముందుకు వచ్చి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని అన్నారు. కార్యక్రమంలో యూత్ ప్రధాన కార్యదర్శి గుండా నరేష్, ఉపాధ్యక్షుడు దాసరి వెంకటేష్, కోశాధికారి చందనగిరి రాజేందర్, సలహాదారులు బుర్ర రమేష్, రామిండ్ల నరేష్, ఆకుల అభిలాష్, పంజాల సతీష్, ఉప్పులేటి రాజ్‌కుమార్, చిందం వెంకటేష్, రాజకుమార్, చంద రఘు, కోడూరి సిద్ధూ, నాంపల్లి వెంకటేష్ నాడెం గణేష్, వినయ్, గౌతమ్ పాల్గొన్నారు.

నవతెలంగాణ 9వ వార్షికోత్సవ ప్రత్యేక సంచిక ఆవిష్కరణ



నవతెలంగాణ-లక్షెట్టిపేట

నవతెలంగాణ 9వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం వెలువడిన ప్రత్యేక సంచికను తహసీల్దార్ ఎ.దిలీప్‌కుమార్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ నిష్పక్షపాతంగా వార్తలు రాయడంలో నవతెలంగాణ కృషి బాగుందని కొనియాడారు. కార్మికులు, బడుగు బలహీన వర్గాల సమస్యలను వెలికితీస్తూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటుందని అభినందించారు. సమస్యల పరిష్కారమే ఎజెండాగా ముందుకు సాగుతున్న నవతెలంగాణ పత్రిక యాజమాన్యానికి అభినందనలు తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-దండేపల్లి

మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన సోగల శ్రీనివాస్ ఇటీవలే విద్యుత్ షాక్ తో మృతిచెందగా ఆయన కుటుంబానికి గ్రామ యువకులు బాసటగా నిలిచారు. శనివారం మృతుడు శ్రీనివాస్ కుటుంబాన్ని పరామర్శించి స్నేహితులు గ్రామస్తుల ఆధ్వర్యంలో సేకరించిన రూ.30 వేల విరాళాన్ని కుటుంబసభ్యులకు అందజేశారు. కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామము చెందిన యూత్ సభ్యులు బచ్చల సుభాష్, గూడ లక్ష్మణ్, జమీర్, కొమరయ్య, బచ్చల స్వామి, ఇమామ్, కాంతారావు, రాములు పాల్గొన్నారు.

పదవీ విరమణ పొందిన కార్మికులకు సన్మానం

నవతెలంగాణ-జైపూర్

సింగరేణి కార్మికునిగా పదవీ విరమణ పొందుతున్న కార్మికులను సీఐటీయూ నాయకులు ఘనంగా సన్మానించారు. ఇందారం-1ఏ గనిలో పదవీ విరమణ పొందుతున్న వారిని సీఐటీయూ నాయకులు శనివారం పూల మాలలు, శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ కార్యదర్శి అంబాల శ్రీనివాస్, పిట్ నాయకులు నవీన్, మోయినోద్దీన్, వెంకట్ రెడ్డి, రవీందర్, విజయ్ పాల్గొన్నారు.

నిరుద్యోగ ఫోరం నాయకుడు అరెస్ట్

నవతెలంగాణ-తాండూర్

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క మంచిర్యాల జిల్లా పర్యటన సందర్భంగా మండలానికి చెందిన తెలంగాణ నిరుద్యోగ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుముల శ్రీకృష్ణదేవరాయలును తాండూర్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా శ్రీకష్ణదేవరాయలు మాట్లాడుతూ అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని ఉపముఖ్యమంత్రికి నిరుద్యోగుల సమస్యలను విన్నవించడానికి వీలు లేకుండా పోలీసులు అరెస్టు చేయడం తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల నిరుద్యోగులు నష్టపోయారని అదే తీరుగా ఈ రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించడం దారుణమని అన్నారు.

శివనాగుల విగ్రహ ప్రతిష్టాపన

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని పొన్కల్ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని వీర్లగుట్ట సమీపాన నూతనంగా శ్రీ శివనాగుల విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి వేద పండితులు పూజ హోమం యజ్ఞ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని చేసి విగ్రహానికి ప్రాణ ప్రతిష్ట చేశారు. కార్యక్రమంలో విగ్రహ ప్రతిష్టాపన కమిటీ సభ్యులు పూజారులు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


కోల్‌మైన్స్ పెన్షన్ స్కీంను సవరించాలి

నవతెలంగాణ-జైపూర్

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులక పెన్షన్ స్కీం సవరిస్తున్నట్లుగా కోల్‌మైన్స్ పెన్షన్ స్కీం సవరించాలని సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులు అభ్యర్థిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు మేలు చేకూర్చే విధంగా 2025 ఏప్రిల్ 1 నుంచి యూనిఫైడ్ పెన్షన్ స్కీం అమలు పర్చేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతుంది. అదే మాదిరిగా బొగ్గు సంస్థల ఉద్యోగుల విషయంలో కోల్‌మైన్స్ పెన్షన్ స్కీం సవరించి రిటైర్డ్ ఉద్యోగులకు న్యాయం చేయాలని రిటైర్డ్ ఉద్యోగులు కోరుతున్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేయతలపెట్టిన యూనిఫైడ్ పెన్షన్ స్కీం ద్వార 2004 సంవత్సరం నుంచి ఉద్యోగంలో చేరిన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు సుమారుగా 23 లక్షల మంది లబ్దిపొందనున్నారు. సవరించిన యూనిఫైడ్ పెన్షన్ స్కీంతో పెన్షనర్లకు ద్రవ్యోల్బణ సూచిక సదుపాయం ద్వార కరువుభత్యం లభించనున్నట్లు వారు పేర్కొంటున్నారు. సింగరేణి ఉద్యోగుల కోసం 1998 సంవత్సరంలో తీసుకొచ్చిన పెన్షన్ స్కీం ప్రతి మూడు సంవత్సరాలకు ఒక సారి సమీక్షించాల్సివుంటుంది. కాని ఇప్పటి వరకు ఒక సారి కూడా సమీక్షంచకపోవడంతో బొగ్గు పెన్షనర్లకు అన్యాయం జరుగుతోందని ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. ఫలితంగా అతి తక్కువ పెన్షన్ పొందుతున్న రిటైర్డ్ ఉద్యోగులకు ఆర్థికంగా నష్టపోవల్సి వస్తోందని వాపోతున్నారు. రోజు రోజుకు పెరుగుతున్న నిత్యావసర వస్తువులతో పాటు ఇతరత్ర ఖర్చులతో చాలీచాలని పెన్షన్‌తో తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొవల్సి వస్తోందని పేర్కొంటున్నారు. లాభాలు అర్జిస్తున్న సింగరేణి యాజమాన్యం రిటైర్డ్ ఉద్యోగుల పట్ల నిర్లక్ష్యం వహిస్తోందని, పదవీ విరమణ పొందిన రోజు వరకు సంస్థ శ్రేయస్సు కోరి పని చేసిన ఉద్యోగుల పట్ల సానుకూలత ప్రదర్శించాలని కోరుతున్నారు. కోలిండియాతో పాటు సింగరేణి ద్వార సుమారుగా 6 లక్షల మంది పెన్షన్లు పొందుతుండగా ఇందులో అతి తక్కువ పెన్షన్ పొందతున్నావారు అత్యధికులని వారు తెలిపారు. నేషనల్ పెన్షన్ స్కీం సవరిస్తూ కేంద్ర ప్రభుత్వం యూనిఫైడ్ పెన్షన్ స్కీం తీసుకొస్తున్నట్లుగా కోల్ ఇండియా, సింగరేణి ఉద్యోగులకు లాభం చేకూరే విధంగా కోల్ మైన్స్ పెన్షన్ స్కీం సవరించి న్యాయం చేయాలని కోరుతున్నారు.

సింగరేణిలో రూ.500లోపు పెన్షన్ పొందేవారే అధికం

ఆళవందార్ వేణుమాధవ్ (రిటైర్డ్ సింగరేణి ఉద్యోగి)



సింగరేణిలో పదవీ విరమణ పొందిన ఉద్యోగుల్లో అత్యధికులు రూ.500లోపు నెల సరి పెన్షన్ పొందుతున్న వారు అత్యధికంగా ఉన్నారు. కోల్ మైన్స్ పెన్షన్ స్కీం-1998 సవరించాలని సింగరేణి యాజమాన్యంతో పాటు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిదులను కలిసి ఎన్నో వినతలు సమర్పించాము. గత పది ఇరువై సంవత్సరాలుగా రూ.200, రూ.300 పెన్షన్ పొందుతున్న వారు ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నారు.. తెలంగాణ రాష్ట్రంలో గత ప్రభుత్వం రూ.2,016 పెన్షన్ పంపిణీ చేయగా ప్రస్తుత ప్రభుత్వం రూ.4 వేల చొప్పున పంపిణీ చేస్తామని ప్రకటించింది. కాని సింగరేణి ఉద్యోగిగా పదవీ విరమణ పొంది సింగరేణి అభివృద్ధికి ఎంతగానో కష్టపడిన కార్మికులు పదవీ విరమణ పొంది ఆర్థికంగా ఎంతగానో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సింగరేణిలో పదవీ విరమణ పొందిన ఉద్యోగుల కుటుంబాలను కదిలిస్తే కన్నీటి పర్యంతం. ఇప్పటికైనా కోల్‌మైన్స్ స్కీం సవరించి సంస్థ కోసం పని చేసి పదవీ విరమణ పొందిన సింగరేణి ఉద్యోగులను ఆదుకోవల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రేపటి ధర్నాను విజయవంతం చేయండి

- సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కలిందర్ ఖాన్

నవతెలంగాణ-జన్నారం



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విదానాలకు వ్యతిరేకంగా సెప్టెంబర్ 2న చలో కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కలిందర్‌ఖాన్ కోరారు. శనివారం మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో మూడవసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం మొన్న ప్రవేశపెట్టిన అటువంటి బడ్జెట్‌లో వారికి నచ్చినటువంటి రాష్ట్రాలకే ఎక్కువ బడ్జెట్ కేటాయించడం వ్యతిరేకంగా ఉన్నటువంటి రాష్ట్రాలకు బడ్జెట్ కేటాయించకపోవడం ఇది ప్రజాస్వామ్యాన్ని కూని చేయడమే అవుతుందన్నారు. రోజురోజుకు అన్ని రకాల నిత్యావసర సరుకులపై ధరలు పెంచుతూ ప్రజలపైన ఎనలేని భారం మోపుతూ అదే కార్పొరేట్లకు రూ.లక్షల కోట్ల రుణాలు మాఫీ చేస్తూ దేశంలో 90 శాతం సంపద 10 శాతం సంపన్నుల చేతిలో ఉన్నది అని దుయ్యబట్టారు. అదేవిధంగా తెలంగాణ ప్రజలకు హామీ ఇచ్చిన ప్రభుత్వం రైతులకు ఎలాంటి షరతులు లేకుండా రూ.రెండు లక్షల రుణమాఫీ తక్షణమే చేయాలని డిమాండ్ చేశారు. రైతుబంధు బేసరత్తుగా విడుదల చేయాలని ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలు తక్షణమే అమలు చేయాలని అన్నారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి దాసరి తిరుపతి, జిల్లా సమితి సభ్యులు మిట్టపల్లి పౌలు, చాడ మహేందర్ రెడ్డి, మామిడి విజయ్, బియ్యాల రాజేశం పాల్గొన్నారు.

వైద్యం వికటించి యువకుడు మృతి

- ఆస్పత్రి ఎదుట కుటుంబ సభ్యుల ఆందోళన



నవతెలంగాణ-మంచిర్యాల

వైద్యం వికటించి తమ కుమారుడు మృతి చెందాడని కుటుంబ సభ్యులు, బంధువులు పట్టణంలోని ప్రయివేటు ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వేంపల్లి గ్రామానికి చెందిన దోనోజుల రవితేజ(22) డిగ్రీ పూర్తి చేసుకొని హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ట్రైనింగ్ తీసుకుంటున్నాడు. వారం రోజుల నుంచి జ్వరం రావడంతో హైదరాబాద్‌లో తను ఉండే ప్రాంతంలో ఆర్‌ఎంపీని సంప్రదించడంతో ఆర్‌ఎంపీ ఇంజెక్షన్ వేశాడు. ఇంజెక్షన్ వేసిన చోట రియాక్షన్ అయి గడ్డ అయింది. ఈ గురువారం ఇంటికి వచ్చాడు. శుక్రవారం మంచిర్యాలలోని సన్ ఆస్పత్రిలో సంప్రదించగా సర్జరీ చేసి గడ్డను తొలగించాలని డాక్టర్లు తెలిపారు. సర్జరీ చేసిన మరునాడు మూత్రం రావడం ఆగిపోయింది. పరీక్షించిన వైద్యులు అత్యవసర చికిత్స కోసం హైదరాబాద్ వెళ్ళాలని సూచించడంతో హైదరాబాద్‌లోని ప్రయివేటు ఆస్పత్రికి వెళ్లారు. అక్కడ యువకుడిని పరీక్షించిన వైద్యులు రవితేజ శరీరంలో రక్తం లేదని అప్పటికే యువకుడు మృతి చెందినట్లు కుటుంబ సభ్యులకు తెలిపారు. సర్జరీ చేసే సమయంలో మంచిర్యాల సన్ ఆస్పత్రి వైద్యులు నిర్లక్ష్యం వహించారని కుటుంబ సభ్యులు తిరిగి మృతుడి డెడ్ బాడీని తీసుకొని మంచిర్యాలకు వచ్చారు. వైద్యుల నిర్లక్ష్యంగానే రవితేజ మతి చెందాడని ఆస్పత్రి ఎదుట మృతదేహంతో ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న మంచిర్యాల పట్టణ సీఐ బన్సిలాల్ సంఘటన స్థలానికి చేరుకొని కుటుంబ సభ్యులతో మాట్లాడి ఆందోళన విరమించేలా చేశారు.

మున్సిపల్ అత్యవసర కౌన్సిల్ సమావేశం

నవతెలంగాణ-మంచిర్యాల



మంచిర్యాల మున్సిపాలిటీ అత్యవసర సర్వ సభ్య సమావేశాన్ని మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య అధ్యక్షతన శనివారం నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించి సమావేశంలో కమిషనర్ మారుతి ప్రసాద్ 15 అంశాలకు సంబంధిన ప్రతిపాదనను కౌన్సిల్ ముందు ఉంచాగా సభ్యులు ఆమోదం తెలిపారు. వీధి కుక్కల నియంత్రణ, వినాయక మండపాల ఏర్పాట్లు, వీధి దీపాలు నిర్వహణా, వాత వరణ మార్పులతో వైరల్ ఫీవర్స్, అంటూ వ్యాధులు ప్రబలకుండా వార్డుల్లో తగిన పారిశుధ్య పనులు చేపట్టేందుకు కేటాయించిన నిధుల ప్రతిపాదన ఆమోదించారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ సళ్ల మహేష్ పాల్గొన్నారు.

పాఠశాలలను సందర్శించిన నోడల్ అధికారి



నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్, కేజీబీవీ పాఠశాలలను ఎల్ఐపీలో భాగంగా మండల నోడల్ ఆఫీసర్ రమేష్ రాథోడ్ సందర్శంచారు. ఈ సందర్భంగా 9వ తరగతిలో నేరుగా విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. 10వ తరగతి చదువుతున్న విద్యార్థులతో సమావేశమై పదో తరగతిలో 10/10 జీపీఏ, వంద శాతం ఉత్తర్ణత సాధించడానికి పలు సూచనలు చేశారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసి విద్యార్థలు సాధించాల్సిన సామర్థ్యాలు గురించి వివరించారు. వెనుకబడిన విద్యార్థలను బేస్ లైన్ టెస్ట్ నిర్వహించి వారికి బేసిక్ క్లాసులను నిర్వహించాలని వివరించారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ అందె నాగ మల్లయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కడుపునొప్పి భరించలేక పురుగులమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-దండేపల్లి

మండలంలోని గూడెం గ్రామానికి చెందిన గోపతి రవి 42 అనే వ్యక్తి కడుపు నొప్పి బరించలేక పురుగుల మందు తాగినట్లు దండేపల్లి ఎస్ఐ ఉదయ్ కిరణ్ తెలిపారు. పోలీసులు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గత కొన్ని సంవత్సరాలుగా తీవ్ర కడుపు నొప్పితో పలుమార్లు ఆసుపత్రిలో చూపించిన నయం కాలేదు. ఆస్పత్రి ఖర్చుల కోసం చేసిన అప్పు తీరడం లేదని పలుమార్లు కుటుంబ సభ్యులతో చెబుతూ బాధపడుతుండేవాడు. శనివారం ఉదయం ఏదో గుర్తుతెలియని పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పురుగుల మందు తాగిన విషయం ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులకు చెప్పాడు. వెంటనే కుటుంబ సభ్యులు లక్షెట్టిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు మృతుని భార్య సుమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఉదయ్ కిరణ్ తెలిపారు.

పాఠశాల అభివృద్ధికి స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయం

- జిల్లా విద్యాధికారి యాదయ్య



నవతెలంగాణ-దండేపల్లి

మండలంలోని గుడిరేవు ప్రాథమిక పాఠశాలలో బడిబాగులో నేను అనే కార్యక్రమం ద్వారా విరాళంగా అందజేసిన డిజిటల్ క్లాస్ రూమ్‌లను జిల్లా విద్యాధికారి యాదయ్య శనివారం ప్రారంభించారు. పాఠశాలలో గుండ మల్లికార్జున్ అనే వ్యక్తి టెలివిజన్ పరికరాలను డిజిటల్ క్లాస్‌లకు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి యాదయ్య మాట్లాడుతూ విద్యార్థులు డిజిటల్ తరగతులను వినియోగించుకొని అన్ని విషయాలను అవగాహన చేసుకుని సూచించారు. పాఠశాలలో గత నెలలో 100 శాతం హాజరు శాతం ఉన్న సహస్ర శ్రీ, శ్రీ లాస్యాలను అభినందించారు. బడిబాగులో నేను కార్యక్రమం ప్రారంభించి మిత్రులు, గ్రామస్తుల ద్వారా పాఠశాల అభివద్ధికి పాటుపడుతున్న ప్రధానోపాధ్యాయులు బుచ్చన్న ఉపాధ్యాయ బందాన్ని జిల్లా విద్యాధికారి అభినందించారు. ఈ కార్యక్రమంలో గుడిరేవు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, పాఠశాల సిబ్బంది అంగన్వాడీ కార్యకర్త లక్ష్మి, పంచాయతీ సెక్రెటరీలు శ్రీనివాస్, శ్రీహరి పాల్గొన్నారు.

జిల్లా స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు విద్యార్థి ఎంపిక

నవతెలంగాణ-కాసిపేట



జిల్లా స్థాయి పాఠశాలల ఫుట్ బాట్ పోటీలకు కాసిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ప్రతిభ కనభరిచి ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం మామిడిపెల్లి సాంబమూర్తి తెలిపారు. శనివారం కాసిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాఖలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హెచ్ఎం మాట్లాడుతూ మందమర్రి మండలం బొక్కలగుట్టలోని హెవన్ ఆఫ్ హొప్ ఉన్నత పాఠశాలలో పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి అండర్-14 పాఠశాలల ఫుట్ బాల్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 7వ తరగతి విద్యార్థి బానోత్ విష్ణు కుమార్ అత్యున్నత ఆటను ప్రదర్శించి ఉమ్మడి జిల్లా పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ మేరకు విద్యార్థిని ప్రధానోపాధ్యాయులు మామిడి పెల్లి సాంబమూర్తి, వ్యాయామ ఉపాధ్యాయుడు బుక్య రాజన్న, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ స్వరూప, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుడికి సన్మానం

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని సాలేగూడ గిరిజన పాఠశాలలో ఉపాధ్యాయుడిగా 12 ఏళ్ల పని చేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుడు ఏ మొండయ్యకు ఘనంగా సన్మానం చేశారు. ఆదివాసీ యూత్ కమిటీ, గ్రామ మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో శాలువాలు, పూలమాలలతో ఉపాధ్యాయుడు మొండయ్యను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వాసుదేవ్, సుగుణ, సీఆర్పీ రమేష్, కార్యదర్శి తనూజ, నాయకపోడ్ సేవా సంఘం రాష్ట్ర నాయకులు కొమ్ముల బాపు పాల్గొన్నారు.

గోదావరి పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-జన్నారం

కడెం పరివాహక ప్రాంతంలో(క్యాచ్మెంట్) వర్షాలు ఎక్కువగా పడుతున్నందున కడెం ప్రాజెక్టు వరద గేట్లను తెరిచి నీటిని కిందికి వదలడం జరుగుతుందని, పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల తహసీల్దార్ రాజ మనోహర్‌రెడ్డి సూచించారు. శనివారం సాయంత్రం వారు మీడియాతో మాట్లాడుతూ, గోదావరి పరివాహక గ్రామాలైన కలమడుగు, ధర్మారం బాదంపల్లి చింతాగూడ రోటి గూడ తపాలాపూర్ తిమ్మాపూర్ రాంపూర్ గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉంటూ గోదావరిలోకి పశువులు గాని గొర్రెలు గాని మొదలగునవి వెళ్లకుండా చూడాలన్నారు. చేపలకు వేటకు వెళ్లకూడదన్నారు. గొర్రె కాపరులు రైతులు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

దొంగతనం కేసులో ఒకరి అరెస్ట్

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని దేవాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తుంగగూడెం గ్రామానికి చెందిన మేకల శశి కుమార్‌పై దొంగతనం కేసులో అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు దేవాపూర్ ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. తుంగగూడెంలో మేకల పద్మ ఇంట్లో తన మరిది కొడుకైన మేకల శశి కుమార్ జల్సాలకు అలువాటు పడి మేకల పద్మ ఇంటి తాళం పగలగొట్టి ఇంట్లో బీరువాలో ఉన్న రూ.90000 దొంగతనం చేసినట్లు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కొండాపూర్ యాప బస్టాండ్ వద్ద శశి కుమార్‌ను అరెస్ట్ చేసి రిమాండ్ చేసినట్లు వివరించారు.

జిల్లా కేంద్రంలో భారీ వర్షం

- వట్టివాగు, అడ ప్రాజెక్టు గేట్ల ఎత్తివేత

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలో శనివారం భారీ వర్షం కురిసింది. సాయంత్రం ప్రారంభమైన వర్షం మూడు గంటల పాటు నిరంతరాయంగా కురిసింది. దీంతో జిల్లా కేంద్రంలోని పైకాజీనగర్, జూబ్లీ మార్కెట్ ప్రాంతంలో రోడ్లపై వరద నీరు పారడంతో జనాలు ఇబ్బందులకు గురయ్యారు. ప్రధాన రహదారి పక్కన గల దుకాణాలలోకి డ్రైనేజీ నీరు వచ్చి చేరడంతో బైక్ మెకానిక్ దుకాణదారులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. మండలంలోని వట్టివాగు రెండు గేట్లు ఎత్తి అధికారులు నీటిని కిందికి వదులుతున్నారు. కుమురం భీం ప్రాజెక్టు గేట్ల ద్వారా కూడా నీటిని వదులుతున్న అధికారులు దిగువ ప్రాంతంలో గల ప్రజలను అప్రమత్తం చేశారు. మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. ఏదిఏమైనా శనివారం కురిసిన భారీ వర్షంతో జిల్లా కేంద్రంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో నీరు రోడ్లపై ప్రవహించి ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

రోడ్ల మరమ్మత్తులు చేపట్టాలి : కలెక్టర్

నవతెలంగాణ-కౌటాల



వర్షాలకు రోడ్లు అధ్వానంగా మారాయని వాటిని మరమ్మత్తులు చేసేల ప్రణాళికలు చేయాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అధికారులను ఆదేశించారు. శనివారం మండలంలోని ఆయా గ్రామాల్లో కలెక్టర్ పర్యటించి రోడ్ల పరిస్థితులను పరిశీలించారు. కుంబారి, ముత్యం పేట్ నుంచి పార్డీ గ్రామానికి వెళ్ళే రోడ్డు పూర్తిగా బురద మయంగా మారి రవాణాకి ఇబ్బందిగా మారిన తరుణంలో పంచాయితీ రాజ్ అధికారులు మరమ్మతుల కోసం ప్రతిపాదనలు తయారు చేయగా వాస్తవ పరిస్థితిని ఆయన పరిశీలించారు. బురద, గుంతల రోడ్డుపై మొరం పోస్తే మళ్ళీ వర్షాలకు అది కొట్టుకు పోతుందన్నారు. పార్డీ రోడ్డుకు వెళ్ళే మార్గంలో కంకర క్రషర్లు నుంచి అధిక లోడ్‌తో వెళ్ళే లారీలతో రోడ్డు డ్యామేజ్ అవుతున్న విషయం అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకు రాగా క్రషర్ల నుంచి మెటీరియల్ తీసుకొని గుంతలు పూడ్చాలని అధికారులను ఆదేశించారు.

కేజీబీవీ పాఠశాల ఎదుట తల్లిదండ్రుల నిరసన



నవతెలంగాణ-కెరమెరి

మండలంలోని మోడీ కేజీబీవీ ఎస్ఓ బదిలీ హైడ్రామాకు చోటుచేసుకుంది. ఉన్నట్టుండి కేజీబీలోని ఇంటర్ విద్యార్థులు రోడ్డుపైకి రావడం సంచలనంగా మారింది. శనివారం రోడ్డుపైకి వచ్చిన విద్యార్థినులు ఎస్ఓ బదిలీ రద్దు చేయాలని బైటాయించడంతో పోలీసులు చేరుకొని వారిని సముదాయించి లోనికి పంపించారు. రోడ్డుపైకి వచ్చేలా సదరు ఎస్ఓనే రెచ్చగొట్టినట్లు పలువురు విద్యార్థులు చెప్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. పాఠశాలలోని మరో టీచర్‌కు 2 రోజుల ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించినట్లు సమాచారం. సోమవారం పొలాల అమావాస్య పండగ ఉండడంతో పిల్లలను స్వగ్రామాలకు తీసుకెళ్లేందుకు తల్లిదండ్రులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కానీ వారిని లోనికి అనుమతించలేదు. పిల్లలను పంపించడానికి ఇన్‌చార్జి ఎస్ఓ ఒప్పుకోలేదు. దీంతో తల్లిదండ్రులు రోడ్డుపై బైటాయించారు. సదురు టీచర్ పిల్లలను పంపడం కుదరదని చెప్పడంతో తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

నాటిన మొక్కలను సంరక్షించాలి

నవతెలంగాణ-బెజ్జూరు



ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని ఎస్సై విక్రం అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జ్యోతిబాపూలే విద్యాలయంలో వన మహోత్సవంలో భాగంగా మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు మానవాళి మనుగడకు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. మొక్కలతో పర్యావరణ సమతుల్యత ఏర్పడుతుందన్నారు. నాటిన మొక్కలకు ప్రతిరోజు నీరు పోసి సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది ఓం ప్రకాష్, తిరుపతి, వసంత్, పాఠశాల చైర్మన్ సురేష్ ఉన్నారు

శాంతియుత వాతావరణంలో పండగలు జరుపుకోవాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రానున్న రోజుల్లో జరిగే వినాయక నవరాత్రి ఉత్సవాలు, మిలాద్ ఉన్ నబీ పండగలు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని డీఎస్పీ సదయ్య సూచించారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో సీఐ సతీష్‌తో కలిసి ముస్లిం మత పెద్దలతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక నిమజ్జనోత్సవం, మిలాద్ ఉన్ నబి ఒకే రోజు వస్తున్నాయని, దీని దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ముస్లిం మత పెద్దలు మిలాద్ ఉన్ నబి పండుగను సెప్టెంబర్ 19న నిర్వహించడానికి నిర్ణయించారన్నారు. దాని ఆధారంగా జిల్లాలో కూడా 19న మిలాద్ ఉన్ నబి పండుగను నిర్వహించుకోవాలని సూచించారు. శాంతియుత వాతావరణంలో రెండు పండుగలు జరిగేలా సహకరించాలని కోరారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే అసత్య ప్రచారాలను నమ్మకూడదన్నారు.కార్యక్రమంలో పీస్ కమిటీ సభ్యులు, ముస్లిం మత పెద్దలు సయ్యద్ నిసార్, అబ్దుల్ రహమాన్, సాబీర్ అలీ, బిన్ యాహియా, మన్సూర్ బిన్ అబ్దుల్ రాబ్, సలాం, మహమ్మద్ అహ్మద్, సలీం బెగ్, ఇమ్రాన్, ఖైజర్, హారుణ్, జాఫర్ సాదిక్ హుస్సేన్, ఫైజల్, యుదాసిర్, అబ్దుల్ ఆలం, అబ్దుల్ హసన్ పాల్గొన్నారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ- ఆదిలాబాద్ టౌన్

అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని తమ కుటుంబాలకు బాసటగా నిలిచి ఆర్థికంగా నిలదొక్కుకోవాలని జిల్లా ఉపాధి కల్పనశాఖ అధికారిణి మిల్కా అన్నారు. శనివారం పట్టణంలోని స్థానిక ఎంప్లాయిమెంట్ కార్యాలయం ఆవరణలో శనివారం జాబ్ మేళా నిర్వహించగా యువత నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో ప్రతినెలా తమ శాఖ ఆధ్వర్యంలో ఆయా కంపెనీలు, పలు సంస్థల సహకారంతో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అందులో భాగంగానే ఈ కామ్ ఎక్స్‌ప్రెస్ ద్వారా డెలీవరి బాయ్ కోసం ఈ మేళా ఏర్పాటు చేశామన్నారు. ప్రతి నెల రూ. 15 వేల నుంచి రూ.20 వేల వరకు జీతం ఉంటుందని, కంపెనీ ఇన్సెంటివ్ సైతం ఇస్తుందని తెలియజేశారు. కంపెనీ ద్వారా కల్పించే ఇతరాత్ర సౌకర్యాలను వివరించారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని యువకులు సద్వినియోగపర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏఓ ఖాదర్ హుస్సేన్‌కు వీడ్కోలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆసిఫాబాద్ మండల వ్యవసాయ అధికారిగా విధులు నిర్వహించి బదిలీపై జమ్మికుంటకు వెళ్లిన ఏఓ ఖాదర్ హుస్సేన్‌ను జిల్లా కేంద్రంలోని మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలు కొనియాడారు. కార్యక్రమంలో ఏఓ మిలింద్, మాజీ ఎంపీపీ మల్లికార్జున్, సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, ఏఈఓలు చిరంజీవి, రాము, నాయకులు సుంకరి పెంటయ్య, ఫెర్టిలైజర్ దుకాణ యజమానులు నాందేవ్, ఖాలిద్, గిరీష్, గుండా సతీష్, ఆశిష్, ఎండీ ముబీన్, వసంత్, చిట్ల నారాయణ, ఆత్మ రమేష్, పుల్లూరి శ్రీనివాస్, మిట్ట పోషన్న పాల్గొన్నారు.



మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యుడు బండారి రవికుమార్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో ప్రజలకు మౌలిక వసతులు కల్పించడంపై ప్రభుత్వం దృష్టి సారించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యుడు బండారి రవికుమార్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, మౌలిక వసతులు కల్పించడంతో పాటు ఉపాధ్యాయుల భర్తీ పూర్తిస్థాయిలో చేయాలన్నారు. సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న వేళ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వైద్యుల నియామకంపై దృష్టి సారించి పేదలకు నాణ్యమైన వైద్యం అందించాలన్నారు. జిల్లాలో 44 మంది వైద్యులు ఉండాల్సి ఉండగా కేవలం 12 మంది మాత్రమే ఉన్నారన్నారు. దీంతో అనేక మంది ప్రజలు సీజనల్ వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. జిల్లాలో హెల్త్ ఎమర్జెన్సీ విధించాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని ప్రధాన ప్రాజెక్టు కుమురం భీం ప్రాజెక్టు పరిస్థితి అధ్వానంగా ఉందని వెంటనే మరమ్మతులు చేసి పూర్తిస్థాయి నీటి నిలువ ఉండేలా చూడాలన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు పూర్తి చేయాలని కోరారు.



జిల్లాలోని అనేక హాస్టల్స్‌కు సొంత భవనాలు లేవని సొంత భవనాల నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అప్పుడే పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి కుషన్న రాజన్న, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం దినకర్, కోట శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు దుర్గం రాజ్ కుమార్, ముంజం ఆనంద్ కుమార్, జాదవ్ రాజేందర్, ముంజం శ్రీనివాస్, గొడిసెల కార్తీక్ పాల్గొన్నారు.

ఆదిలాబాద్ మున్సిపల్ సమావేశం రసాభాసా

- అక్రమ నిర్మాణాలపై కాంగ్రెస్ సభ్యుల మండిపాటు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం మున్సిపల్ ఛైర్మెన్ జోగు ప్రేమేందర్ అధ్యక్షతన నిర్వహించిన కౌన్సిల్ సమావేశం రసాభాసాగా మారింది. సమావేశం ప్రారంభం కాగానే కాంగ్రెస్ కౌన్సిల్ సభ్యులు నిల్చొని బల్దియా పరిధిలో ఆక్రమణలు, అక్రమ కట్టడాల అంశాలపై లేవనెత్తారు. విచారణ జరిపి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్ చేశారు. ప్లకార్డులు ప్రదర్శించి నిరసన వ్యక్తం చేశారు. అక్రమార్కులకు వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. దీంతో సభలో ఒక్కసారిగా గందరగోళం నెలకొంది. మున్సిపల్ ఛైర్మెన్ చర్చిద్దామని చెప్పగా సభ్యులు ఆగకుండా ఆందోళన కొనసాగించారు. అధికారులు దీనిపై సమాధానం చెప్పాలంటూ పట్టుబట్టారు. బీజేపీ సభ్యులు ముందుగా ఎజెండా అంశాలపైనే చర్చ జరపాలంటూ ఛైర్మెన్ పోడియం వద్దకు వెళ్లి నినదించారు. సభ్యుల నిరసన నినాదాల మధ్య సభ ఒక్కసారిగా వేడెక్కింది. ఛైర్మెన్ సభ్యులకు సర్దిచెప్పి ఎజెండాను ప్రవేశపెట్టగా కౌన్సిలర్లు అనేక సమస్యలపై, అంశాలపై మాట్లాడారు. అధికారుల పనితీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బల్దియా పరిధిలో అనేక స్థలాలు ఉన్నప్పటికీ వాటిని పరిరక్షించడంలో విఫలం అవుతున్నారని ధ్వజమెత్తారు. తాంసి బస్టాండ్ సమీపంలో మున్సిపాలిటీకి చెందిన ఖాళీ స్థలాన్ని దర్జాగా ఆక్రమించి ప్రస్తుతం అక్కడ నిర్మాణం చేపడుతున్నారని ఆరోపించారు. 20 ఏళ్ల కిందట లేఅవుట్ చేసిన సందర్భంలో కొంత ఖాళీ స్థలాన్ని వదిలేశారన్నారు. ఆ స్థలంలోనే ప్రజల అవసరాల దృష్ట్యా సులభ్ కాంప్లెక్స్ నిర్మాణం జరిపారన్నారు. కోట్లు విలువ చేసే ఆ స్థలంపై కొందరు అక్రమార్కుల కన్నుపడిందని పేర్కొన్నారు. ఆరు నెలల కిందట సులభ్ కాంప్లెక్స్‌ను కూల్చివేసి బిల్డింగ్ నిర్మాణం జరుపుతున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారంలో అప్పటి మున్సిపల్ అధికారులకు భారీగా ముడుపులు ముట్టజెప్పగా వారు భవన నిర్మాణానికి అక్రమంగా అనుమతిలిచ్చారని ఆరోపించారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్ చేశారు. అటు లీజు స్థలాలు సైతం అనేకం అన్యాక్రాంతం అవుతున్నాయని, బల్దియా అధికారులకు ఇది ఎందుకు పట్టడంలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వాటిని కబ్జా కాకుండా ఇప్పటికైనా పటిష్టమైన చర్యలు చేపట్టాలని, ఒక కమిటీని వేయాలని కోరారు. వినాయక నవరాత్రి ఉత్సవాలు సమీపించిన తరుణంలో టౌన్‌లో దెబ్బతిన్న రహదారులకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలన్నారు. ఏర్పడిన గుంతలను పూడ్చివేయాలన్నారు. రోడ్ల మరమ్మతులకు సంబంధించిన టెండర్ ప్రక్రియ పూర్తయినప్పటికీ సదరు కాంట్రాక్టర్ పనులు ఇప్పటివరకు ప్రారంభించలేదని, దాన్ని రద్దు చేసి వేరేవారికి అప్పజెప్పాలని పట్టుబట్టారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, బల్దియా అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ దిశగా అవసరమైన భద్రత చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శనివారం ఎస్పీ డీవీ.శ్రీనివాస్ రావు, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ ఆర్డీఓలు లోకేశ్వర్ రావు, కాసపోయిన సురేష్‌తో కలిసి వివిద శాఖల అధికారులతో రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. జిల్లాలో తరచుగా ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి సూచిక బోర్డులు, వేగ నియంత్రికల ఏర్పాటుతో పాటు అవసరమైన రక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల ద్వారా ఇప్పటి వరకు 38 మంది మరణించారని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించే విధంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రమాదాలు జరిగే ప్రాంతాలలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, బ్లాక్ స్పాట్లను గుర్తించి అవసరమైన చోట రోడ్లు భవనాలు, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం అధికారుల సమన్వయంతో స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. సర్వీస్ రోడ్లపై పశువులు, ద్విచక్ర, భారీ వాహనాలు పెట్టకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతుండటం వల్ల అధిక సంఖ్యలో ప్రమాదాలు జరుగుతున్నాయని, యువత వాహనాన్ని అతివేగంగా నడిపి ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. మద్యం తాగి, మొబైల్ మాట్లాడుతూ వాహనాలు నడుపవద్దని అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. జిల్లాలో గంజాయి సాగు, రవాణ, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారులపై కాలింగ్ బాక్సులు ఏర్పాటు చేయాలని, ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులను సమీపంలోని ఆస్పత్రులకు చేర్చే విధంగా అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ : ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలను నిర్వహించనున్న నేపథ్యంలో ఓటరు జాబితాను తప్పులు లేకుండా రూపొందించాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే సూచించారు. శనివారం అదనపు కలెక్టర్ దీపక్ తివారీతో కలిసి ఆయన కాగజ్‌నగర్ ఎంపీడీఓ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడారు. నూతన ఓటరు నమోదు, సవరణలు, మార్పులు, తొలగింపు అంశాలను ఎన్నికల సంఘం నిబంధనల మేరకు చేపట్టాలని అన్నారు. ఒకే కుటుంబానికి చెందిన వారు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆదేశం మేరకు పోలింగ్ కేంద్రాల గుర్తింపు, ఎన్నికల సిబ్బంది నియామకం వంటి కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని, ఈ క్రమంలో ఓటరు జాబితా రూపకల్పనలో భాగంగా ఆన్‌లైన్ ద్వారా టీ పోల్ పోర్టల్‌లో ప్రతి రోజు లాగిన్ అయి వివరాలను పరిశీలించాలని సూచించారు. ఆదివారం సాయంత్రం వరకు ఓటరు మర్జింగ్ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. సెప్టెంబర్ ఆరో తేదీన



ఓటరు జాబితా ముసాయిదా విడుదల చేయాల్సి ఉన్నందున పనులను వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి, అదనపు పంచాయతీ అధికారి ఉమర్ హుస్సేన్, తహసీల్దార్ కిరణ్, ఎంపీడీఓ రమేష్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

వర్ష సూచనతో యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

ఆసిఫాబాద్ : వచ్చే 3 రోజులలో భారీ వర్ష సూచన ఉన్న నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శనివారం ఎస్పీ శ్రీనివాస్ రావు, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణు, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ ఆర్డీఓలు లోకేశ్వర్ రావు, కాసబోయిన సురేష్‌తో కలిసి టెలికాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని అన్ని మండలాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో భారీగా వర్షాలు పడే అవకాశం ఉన్నందున వాగులు, వంతెన, కల్వర్టుల వద్ద సిబ్బందిని నియమించి ప్రజలు అటువైపుగా వెళ్లకుండా పర్యవేక్షించాలని, చెరువులు, కాలువలు తెగిపోకుండా నీటిపారుదల శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి, మౌలిక వసతులు కల్పించి లోతట్టు ప్రాంతాల ప్రజలను తరలించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి తుకారాం, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి పాల్గొన్నారు.

ప్రజల సౌకర్యార్థం కంట్రోల్ రూమ్ ఏర్పాటు

భారీ వర్షాల నేపథ్యంలో ప్రజల సౌకర్యార్థం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను సందర్శించి విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాబోవు 3 మూడు రోజులు భారీ వర్షం సూచన ఉన్నందున కంట్రోల్ రూమ్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, 24 గంటలపాటు బదిలీల వారీగా విధులు నిర్వహించాలన్నారు. అత్యవసర సేవలు పొందేవారు కంట్రోల్ రూమ్ నం. 6304686505ను సంప్రదించాలన్నారు.

ఆయూష్ ఆధ్వర్యంలో వృద్ధాప్య వైద్య శిబిరం

నవతెలంగాణ-కెరమెరి



మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రభుత్వ ఆయుష్ వైద్యశాల ఆధ్వర్యంలో వృద్ధాప్య వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 50 ఏండ్లు నిండిన వృద్ధులకు రక్తపోటు, మధుమేహం, మోకాళ్ళ నొప్పులు తదితర దీర్ఘకాలిక వ్యాధులకు ఉచిత మందులు అందించారు. ముందుగా వారికి పరీక్షించి అవసరమైన చికిత్సల కోసం మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి సందీప్, వైద్యాధికారి సుజాత, ఫార్మసిస్టు లక్ష్మి మోతిరాం, శ్రీలత, ఇందిరా, ఎంఎల్‌హెచ్‌పీ రాందాస్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదివాసీ బిడ్డలను అవమానించడమే

నవతెలంగాణ- ఆదిలాబాద్‌టౌన్

ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవన ప్రారంభోత్సవ ఆహ్వాన పత్రికలో ఆదివాసీ ప్రజాప్రతినిధుల పేర్లు పొందుపర్చకపోవడం సరికాదని, ఇది ఆదివాసీ బిడ్డలను అవమానించడమేనని ఆదివాసి భారత్ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు కినక సురేష్ అన్నారు. శనివారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కమల్ కిశోర్ అగర్వాల్, గంద్రత్ సంతోష్‌ల తీరును ఆయన తప్పుబట్టారు. జిల్లాకేంద్రంలో నూతన భవనం ప్రారంభోత్సవం సందర్భంగా తమ ఆదివాసీ బిడ్డలైన ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు, కోవలక్ష్మీ పేర్లను ఆహ్వాన పత్రికలో పొందుపర్చకపోవడం, కనీసం వారి ఫ్లెక్సీలు పెట్టకపోవడం బాధాకరమన్నారు. ఇది నిజంగానే ఆదివాసీలకు పట్ల వివక్షకు నిదర్శనమన్నారు. దీనికి నైతిక బాధ్యత వహించి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో యావత్ ఆదివాసీ సంఘాలను కలుపుకుని జిల్లా బంద్‌కు పిలుపునిస్తామని హెచ్చరించారు.

పాఠశాలల పనితీరును పర్యవేక్షించాలి

- ఐటీడీఏ పీఓ ఖుష్బూ గుప్తా



నవతెలంగాణ-ఆసిఫాబాద్

గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలల పనితీరును సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి ఖుష్బు గుప్తా అన్నారు. శనివారం వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ అధికారులు, ఏటీడీఓలు, ఏసీఎంఓలు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోని అన్ని గిరిజన సంక్షేమ పాఠశాలలో విద్యను బలోపేతం చేయాలని, స్కూల్ కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు తమ పరిధిలోని ఏ ఒక్క పాఠశాల మూసి ఉంచకుండా పర్యవేక్షించాలన్నారు. ఉపాధ్యాయులు సెలవు పెట్టితే ప్రత్యామ్నాయంగా మరొక ఉపాధ్యాయుని సర్దుబాటు చేయాలని, ఉపాధ్యాయులు విధులలో సమయపాలన పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలలలో విద్యార్థులకు మెనూ ప్రకారం పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని, విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన వైద్య సేవలను అందించాలన్నారు. స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు వారి పరిధిలోని పాఠశాలల పనితీరును పర్యవేక్షిస్తూ తగు చర్యలు తీసుకోవాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం, అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్ ఎసీఎంఓ ఉద్ధవ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

చవితికి పర్యావరణహితమైన విగ్రహాలను వాడాలి

నవతెలంగాణ-సిర్పూర్(టి)



వినాయక చవితికి పర్యావరణహితమైన విగ్రహాలను వాడాలని జాతీయ హరిత దళం రీజనల్ కోఆర్డినేటర్ బాసిక విద్యాసాగర్ అన్నారు. శనివారం మండలంలోని వేంపల్లి జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో జాతీయ హరిత దళం, విద్యాశాఖ ఆధ్వర్యంలో మట్టి వినాయకుల విగ్రహాల తయారీకి సంబంధించిన కార్యశాల జాతీయ హరితహారం కోఆర్డినేటర్ కటకం మధుకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మట్టి వినాయకులను విగ్రహాలను సులభంగా ఏవిధంగా తయారు చేయవచ్చు రీజనల్ జాతీయ కోఆర్డినేటర్ బాసిక విద్యాసాగర్ విద్యార్థులకు చేసి చూపించారు. విద్యార్థులు స్వయంగా మట్టి వినాయకులు తయారు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సాహంగా ఈ కార్యశాలలో పాల్గొన్న విద్యార్థులు మట్టి విగ్రహాలను తయారు చేయడమే కాకుండా వినాయక చవితి రోజు తమ ఇంటిలో ప్రతిష్టించాలన్నారు. అనంతరం జిల్లా జాతీయ హరిత దళం కోఆర్డినేటర్ కటిక మధూకర్ మాట్లాడుతూ మట్టి విగ్రహాలు సమాజ శ్రేయస్సుకు ఉపయోగపడతాయన్నారు. మట్టి వినాయక విగ్రహాలు చేసిన విద్యార్థులకు బహుమతులు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు ప్రకాష్, లక్ష్మీనారాయణ, ఓం ప్రకాష్, మురళి, శ్యాంసుందర్, శాంతి కుమారి, మాధవి పాల్గొన్నారు.

నాస్‌లో జిల్లా అగ్రస్థానంలో నిలపాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

దేశవ్యాప్తంగా నవంబర్ 19న నిర్వహించనున్న నేషనల్ అచీవ్ మెంట్ సర్వే 2024లో మన జిల్లా అగ్రస్థానంలో నిలపాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. శనివారం నేషనల్ అచీవ్మెంట్ సర్వేపై అన్ని మండలాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు మీద ప్రత్యేక దృష్టి సారించాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో నాణ్యమైన విద్యను బోధించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. నాస్ 2021 ఫలితాల కంటే 2024లో నిర్వహించే సర్వే ఫలితాలలో జిల్లా అగ్రస్థానంలో ఉండేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డీఈఓ పార్సి అశోక్, క్వాలిటీ కో-ఆర్డినేటర్ ఉప్పులేటి శ్రీనివాస్, ప్లానింగ్ కో-ఆర్డినేటర్ అబిద్ అలీ పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో నిత్యావసరాలు పంపిణీ

నవతెలంగాణ-సిర్పూర్(టి)



గత నెలలో కురిసిన భారీ వర్షంతో మండల కేంద్రాన్ని చెందిన ఉపాసే పెంటు ఇల్లు కూలిపోయిన విషయం తెలిసిందే. శనివారం బాధితునికి బియ్యం, నిత్యావసర సరుకులు ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు పైడి సంతోష్ మాట్లాడుతూ కొన్ని రోజుల క్రితం కురిసిన భారీ వర్షంతో ఇల్లు కూలిపోయిందని తెలుసుకున్నామన్నారు. ఈ విషయాన్ని ప్రెస్ క్లబ్ సభ్యులతో చర్చించి బాదుతునికి సరుకులు ఇచ్చినట్లు పేర్కొన్నారు. భారీ వర్షంతో నష్టపోయిన బాధితులను ప్రభుత్వం గుర్తించి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి దుస్స ధనంజయ్, ఉపాధ్యక్షుడు నజీర్ అలీ, సీనియర్ పాత్రికేయుడు జమీల్, రాజశేఖర్, శ్రీధర్, కబీర్ అహ్మద్ ఉన్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

నవతెలంగాణ- ఆదిలాబాద్‌టౌన్

పదవీ విరమణ అనంతరం తమ శేషజీవితాన్ని ఆనందంగా గడపాలని, ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలని ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. దాదాపు 40 ఏండ్లపాటు పోలీసు వ్యవస్థకు సేవలందించి పదవీ విరమణ పొందిన అధికారులకు ఆయన అభినందనలు తెలిపారు. పోలీసు ముఖ్య కార్యాలయంలో శనివారం పదవీ విరమణ పొందిన అధికారులను వారి కుటుంబ సభ్యుల నడుము శాలువా, పూలమాలతో సత్కరించి బహుమతి ప్రధానం చేశారు. ఆదిలాబాద్ వన్‌టౌన్ ఎస్ఐ రామారావు, రూరల్ ఏఎస్ఐ మహమ్మద్ జహీరుద్దీన్లను సత్కరించారు. సర్వీసులో ఎటువంటి రిమార్కులు లేకుండా విధులను నిర్వర్తించి అధికారుల ప్రశంసలు, మన్ననలు పొందడం అభినందనీయమని ఎస్పీ అన్నారు.